


Truth of News
# సూర్య వాస్తవం
PRGI Reg No: APTEL/26/A4781
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 02 | సంచిక : 05 | గురువారం 13 ఆగస్టు 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50
Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

# రాజ్యసభను కుదిపేసిన "లుంగీవాలా" వివాదం

- తనను లుంగీవాలా అని పిలిచారంటూ బీజేపీ ఎంపీపై సీపీఎం ఎంపీ ఫిర్యాదు
- ఆ వ్యాఖ్యలు తాను చేయలేదని, బ్రిట్టాస్ అబద్ధం చెబుతున్నారని సుస్మితా దేవ్ ఖండన
- ఒకరిపై మరొకరు హక్కుల ఉల్లంఘన నోటీసులు దాఖలు

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

రాజ్యసభలో బుధవారం 'లుంగీవాలా' వివాదం తీవ్ర దుమారం రేపింది. తనను ఉద్దేశించి బీజేపీ ఎంపీ సుస్మితా దేవ్ ఈ పదాన్ని ఉపయోగించారని కేరళకు చెందిన సీపీఎం సభ్యుడు జాన్ బ్రిట్టాస్ ఆరోపించడంతో సభలో గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. సోమవారం నాడు సభలో తాను ఆదాయపు పన్ను సవరణ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా తీర్మానాన్ని ప్రవేశపెడుతున్న సమయంలో, పంచె కట్టుకుని ఉన్న తనను చూసి వెనుక సీటులో కూర్చున్న సుస్మితా దేవ్ పదేపదే 'లుంగీవాలా' అని సంబోధించారని బ్రిట్టాస్ సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇది దక్షిణాది సంస్కృతిని, మలయాళీలను అవమానించడమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను గర్వించదగ్గ భారతీయుడినని, దక్షిణాది వాడినని పేర్కొంటూ, ఈ వ్యాఖ్యలపై



సుస్మితా దేవ్‌పై హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చినట్లు వెల్లడించారు.

ఈ ఆరోపణలను సుస్మితా దేవ్ తీవ్రంగా ఖండించారు. తాను అసోంకు చెందిన బెంగాలీనని, వివిధ రాష్ట్రాల వస్త్రధారణ పట్ల తనకు అపారమైన గౌరవం ఉందని స్పష్టం చేశారు. బ్రిట్టాస్ అసత్యాలు చెబుతున్నారని, ఏ విచారణలోనైనా వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆమె పేర్కొన్నారు. అంతేకాకుండా, మతపరమైన గుర్తింపులపై బ్రిట్టాస్ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆయనపై ఆమె కూడా ప్రివిలేజ్

- మిగతా 2లో..

# 33 శాతం మహిళా రిజర్వేషన్ వెంటనే అమలు చేయాలి

- తమిళనాడు సీఎం తీర్మానాలను స్వాగతిస్తున్నాం : ఐద్వా ప్రధాన కార్యదర్శి కనినిక ఘోష్
- మహిళా సంఘాల ఆధ్వర్యంలో ప్రదర్శన




న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

పార్లమెంటు, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మహిళా సంఘాలు చేపట్టిన ధర్నా బుధవారం 18వ రోజుకు చేరింది. జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపేందుకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో, ఢిల్లీ, పంజాబ్, హర్యానా వంటి పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన మహిళలు రౌస్ అవెన్యూ కోర్టు ముందు సమావేశమై, దీన్ దయాల్ ఉపాధ్యాయ మార్గ్ మీదుగా బాల్ భవన్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ ర్యాలీని ఉద్దేశించి ఐద్వా ప్రధాన కార్యదర్శి కనినిక ఘోష్ మాట్లాడుతూ తమిళనాడు అసెంబ్లీలో నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్), మహిళా రిజర్వేషన్‌పై తీర్మానాన్ని ప్రవేశపెట్టిన తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ చర్యను స్వాగతించారు. మహిళా రిజర్వేషన్ అనేది సామాజిక న్యాయానికి సంబంధించిన అంశమని, దీనిని తక్షణమే అమలు చేసేందుకు వీలుగా మహిళా

- మిగతా 2లో..



# జీవితంలో షార్ట్‌కట్‌లు ప్రమాదకరం

- జెన్-జీకి ప్రధాని నరేంద్రమోదీ కీలక సూచన
- సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్‌తో జాగ్రత్తగా ఉండాలని సూచన
- గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు చదవాలంటూ యువతకు హితవు
- మాజీ రాష్ట్రపతి కోవింద్ ఆత్మకథ ఆవిష్కరణ సభలో వ్యాఖ్యలు

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేటి తరం యువతకు (జెన్-జీ) పలు కీలక సూచనలు చేశారు. జీవితంలో అడ్డదారుల వెంట పడొద్దని, అవి అంతిమంగా తీవ్ర నష్టాలకే దారితీస్తాయని ఆయన హెచ్చరించారు. అదే సమయంలో, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బుధవారం నాడు ఢిల్లీలో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆత్మకథ 'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్,

- మిగతా 2లో..

# నేర దర్యాప్తులో 'గోల్డెన్ అవర్' కీలకం

- నేరాల రూపం మారింది.. పోలీసింగ్ మారాలి: సీఎం చంద్రబాబు
- పోలీసులతో సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ ఆధారాల పరిరక్షణలో విఫలం కావొద్దని సూచన
- రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశం
- ఇక నుంచి ప్రతీ నెలా పోలీసుల పనితీరుపై పెర్ఫార్మెన్స్ రిపోర్టు విడుదల
- పోలీసులకు పూర్తి స్వేచ్ఛ, గౌరవం పెంచేలా చర్యలు తీసుకుంటామని హామీ

అమరావతి - సూర్య వాస్తవం

మారుతున్న కాలంతో పాటు నేరాల స్వరూపం, స్వభావం పూర్తిగా మారిపోయాయని, అందుకు అనుగుణంగా పోలీసింగ్ విధానాల్లో సమూల మార్పులు రావాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. నేరం జరిగిన వెంటనే తొలి గంట (గోల్డెన్ అవర్) అత్యంత కీలకమని, ఆ సమయంలో కీలక ఆధారాలు చేజారిపోకుండా చూడటమే నేర నియంత్రణలో మొదటి విజయమని ఆయన పోలీసు ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. బుధవారం నాడు సచివాలయం నుంచి రాష్ట్ర డీజీపీ మొదలుకొని క్షేత్రస్థాయిలోని స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ) వరకు సుమారు 1,650 మంది అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర చరిత్రలో డీజీపీ నుంచి ఎస్‌హెచ్‌ఓ స్థాయి వరకు ఒకేసారి ముఖ్యమంత్రి సమావేశం నిర్వహించడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా



ఆంధ్రప్రదేశ్ పోలీసుల కీర్తి దేశవ్యాప్తంగా మార్మోగాలని, అందుకు తగ్గట్టుగా ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

**పోలీసులకు పూర్తి స్వేచ్ఛ, గౌరవం**

ప్రజలు ప్రశాంతంగా జీవించాలన్నా, రాష్ట్రానికి పెట్టుబడులు రావాలన్నా శాంతిభద్రతలు

- మిగతా 2లో..



# సీజన్-2కు సీజేపీ సన్నాహాలు




# సీబీఐ చార్జ్‌షీట్‌ను పరిగణనలోకి తీసుకున్న ఢిల్లీ కోర్టు

# ఎన్డీఎస్‌ఏ సూచనల మేరకే మేడిగడ్డ పునరుద్ధరణ

- గూడెందొడ్డి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుపై కన్సల్టెన్సీ నియామకం
- ప్రాజెక్టుల పరిహారం.. పునరావాసం వేగవంతం
- గరిష్ట స్థాయిలో గోదావరి జలాల వినియోగం..
- నీటి పారుదల సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు



హైదరాబాద్ - సూర్య వాస్తవం

జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) సూచనల మేరకే సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల్లో నీటి నిల్వ చేయడంతో పాటు పునరుద్ధరణ పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మూడు బ్యారేజీల్లో తేలిన సాంకేతిక లోపాలు, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు సీఎంకు వివరించిన సందర్భంలో సీఎం మాట్లాడుతూ.. సొంత నిర్ణయాలు తీసుకుకోకుండా నిపుణుల సలహా మేరకే ముందుకెళ్లాలని వారికి సూచించారు. ఎల్లంపల్లితో పాటు దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి సాధ్యమైనంత మేరకు ఎత్తిపోతలు చేపట్టాలన్నారు. రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలిసి నీటి పారుదల శాఖపై బుధవారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ)లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో అందుబాటులో ఉన్న గోదావరి జలాలను గరిష్ట స్థాయిలో

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

- నాణేనికి మరో వైపు చూపిస్తా: జగన్
- ఆగస్టు 17 నుంచి ఏపీ శాసనసభ సమావేశాలు
- పార్టీ ప్రజాప్రతినిధులకు జగన్ దిశానిర్దేశం
- శాసనమండలిలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని ఎమ్మెల్సీలకు సూచన
- ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతుల సమస్యలపై గళమెత్తాలని ఆదేశం
- ప్రజా సమస్యలను మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళతానన్న జగన్

# ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా గొంతు నొక్కుతున్నారు..

అమరావతి - సూర్య వాస్తవం

ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా తమ గొంతు నొక్కేందుకే చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆరోపించారు. శాసనసభను దాదాపు రెండేళ్లుగా బహిష్కరిస్తున్నప్పటికీ, శాసనమండలి వేదికగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని ఆయన పార్టీ ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. ఆగస్టు 17 నుంచి ప్రారంభం కానున్న శాసనసభ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో బుధవారం నాడు

- మిగతా 2లో..



## 33 శాతం మహిళా రిజర్వేషన్ వెంటనే అమలు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

రిజర్వేషన్ చట్టాన్ని జనాభా లెక్కలు, నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియల నుంచి వేరు చేయాలని తమిళనాడు ప్రభుత్వం తీసుకున్న వైఖరిని ఐద్వా, నేషనల్ కోయిలిషన్ ఫర్ ఉమెన్స్ రిజర్వేషన్ స్వాగతించాయి. ఈ కార్యక్రమంలో ఐద్వా ఉపాధ్యక్షులు పుణ్యవతి, జగమతి సాంగ్వాన్, కార్యదర్శులు ఆశా శర్మ, సవిత, పంజాబ్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కవల్‌జీత్, ఢిల్లీ రాష్ట్ర అధ్యక్షురాలు ఆశా యాదవ్, ప్రధాన కార్యదర్శి కవితా శర్మ, ఉపాధ్యక్షురాలు మైమూనా, సెహబా ఫరూఖీ, అంజు ఝా తదితరులు ఉన్నారు.

## రాజ్యసభను కుదిపేసిన “లుంగీవాలా” వివాదం

(మొదటిపేజీ తరువాయి)

నోటీసు దాఖలు చేశారు. ఈ వివాదంపై ప్రతిపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. కొందరు ఎంపీలు పార్లమెంట్ వెలుపల పంచెకట్టుతో నిరసన తెలిపారు. సభా నాయకుడు జె.పి. నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు జోక్యం చేసుకుని, సభా మర్యాదలను కాపాడాలని సభ్యులను కోరారు. సభ్యులు ఒకరి సాంస్కృతిక సంప్రదాయాలను కించపరిచేలా వ్యాఖ్యలు చేయవద్దని సూచించిన చైర్మన్, ఇరుపక్షాలను తన ఛాంబర్‌కు పిలిచి సమస్య పరిష్కారానికి ప్రయత్నించారు. ప్రస్తుతం ఇరుపక్షాలు అందజేసిన హక్కుల ఉల్లంఘన నోటీసులు చైర్మన్ పరిశీలనలో ఉన్నాయి.

## జీవితంలో షార్ట్‌కట్‌లు ప్రమాదకరం

(మొదటిపేజీ తరువాయి)

మై స్ట్రగుల్స్’ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. రైల్వే స్టేషన్లలో తరచూ కనిపించే ఒక హెచ్చరికను ప్రధాని ఈ సందర్భంగా గుర్తుచేశారు. “షార్ట్‌కట్ విల్ కట్ యు షార్ట్” (అడ్డదారి మీ జీవితాన్ని కుదిస్తుంది) అనే బోర్డు కేవలం రైల్వే ట్రాక్‌లకే కాకుండా, నిజ జీవితానికి కూడా వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు అందుబాటులో ఉన్నప్పటికీ, త్వరగా వెళ్లాలనే తొందరలో కొందరు ప్రమాదకరంగా పట్టాలు దాటుతుంటారని, అటువంటి అనాలోచిత నిర్ణయాలు ప్రాణాంతకమని ఆయన హెచ్చరించారు. యువత తప్పుడు మార్గాలను వీడి, అర్థవంతమైన జీవన గమనాన్ని ఎంచుకోవాలని ప్రధాని మోదీ సూచించారు. “మీరు ఆరాధించే మహనీయుల జీవిత చరిత్రలను తప్పనిసరిగా చదవండి. వాటి ద్వారా స్ఫూర్తి పొంది సరైన మార్గాన్ని కనుగొనవచ్చు” అని ఆయన యువతకు సలహా ఇచ్చారు. ముఖ్యంగా ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేసే ఇన్‌ఫ్లుయెన్సర్ల కంటెంట్ పట్ల నిరంతరం జాగ్రత్తగా ఉండాలని ఆయన హితవు పలికారు.

## సీజన్-2కు సీజేపీ సన్నాహాలు

హైదరాబాద్ – సూర్య వాస్తవం

మరోసారి పోరుబాటకు కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) సిద్ధమైంది. ఢిల్లీలోని జంతర్ మంతర్ వేదిగా సీజేపీ సీజన్-2 మొదలుకానుందని అభిజిత్ దీప్కే తెలియజేశారు. ఈమేరకు బుధవారం జాతీయ మీడియా సమావేశంలో వెల్లడించారు. ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు ‘లిజనింగ్ టూర్’ నిర్వహిస్తున్నామని. స్వాతంత్ర్య దినోత్సవం నుంచే విద్యా రంగానికి ప్రాధాన్యతనిస్తూ ఒక ప్రచార కార్య క్రమాన్ని చేపడతామని పేర్కొన్నారు. సీజేపీని కట్టడి చేయడానికి పలు కుట్రలు చేస్తున్నారని, తమ పార్టీ సమావేశం నిర్వహించుకోవడానికి హాల్ లభించకుండా ప్లాన్ చేస్తున్నారని బీజేపీ మీద పరోక్షంగా ఆరోపణలు చేశారు. ‘జంతర్-మంతర్’ సీజన్ 2 ఎప్పుడు ప్రారంభమవుతుందని చాలా మంది ఇన్‌స్టాగ్రామ్‌లో కామెంట్ చేస్తున్నారు. ‘జంతర్-మంతర్’ సీజన్ 2 చాలా త్వరలో ప్రారంభం కాబోతోందని నేను వారికి(బీజేపీ) చెప్పాలనుకుంటున్నాను. “ఈ రోజు ఢిల్లీలో మా వాలంటీర్ల సమావేశం నిర్వహించాల్సి ఉంది. మేము ఒక హాల్ కోసం చూస్తున్నాము, కానీ ఎవరూ మాకు అద్దెకు ఇవ్వలేదు. పైనుంచి ఒత్తిడి ఉందని అందరూ చెబుతూనే ఉన్నా రు,” అని దీప్కే అన్నారు. చివరికి పార్టీ ఒక హాల్‌ను సంపాదించగలిగిందని, అయితే సమా వేశం రోజు ఉదయం దాని యజమానులకు బెదిరింపులు వచ్చాయని ఆరోపించారు.

## సీబీఐ చార్జ్‌షీట్‌ను పరిగణనలోకి తీసుకున్న ఢిల్లీ కోర్టు

హైదరాబాద్ – సూర్య వాస్తవం

నీట్ పేపర్ లీక్ కేసులో సీబీఐ దాఖలు చేసిన చార్జ్‌షీట్‌ను ఢిల్లీ కోర్టు బుధవారం పరిగణనలోకి తీసుకుంది. ఈ కేసులో నిందితులుగా ఉన్న 13మందికి వ్యతిరేకంగా సీబీఐ సమర్పించిన తుది నివేదికను ప్రత్యేక జడ్జి అజయ్ గుప్తా పరిగణనలోకి తీసు కున్నారు. “పరీక్ష?ల్లో పేపర్ లీక్‌లు, ఇతర అక్రమ వర్గాల వినియోగానికి సంబంధించిన క్రిమినల్ కేసుల” విచారణ కోసం ప్రత్యేకంగా నియమించిన ఫాస్ట్ ట్రాక్ కోర్టులో సిబిఐ ఇటీవల తన తుది నివేదికను సమర్పించిన సంగతి తెలిసిందే. ఈ చార్జ్‌షీట్‌పై గురువారం నుండి కోర్టు విచారణ చేపట్టే అవకాశం ఉంది. అయితే మైనర్‌లైన సాక్షుల పేర్లను మీడియా ప్రచారం చేస్తోందని.. చార్జ్‌షీట్‌లోని కొన్ని అంశాలు కూడా నిరంతరం మీడియాలో వస్తున్నాయని సిబిఐ కోర్టుకు తెలిపింది. కోర్టులో సమర్పించకముందే.. మీడియాలో ప్రచురితమవడం దిగ్భ్రాంతికరమని సిబిఐ పేర్కొంది. సాక్ష?్లల పేర్లను మీడియా ప్రచురించడంపై కోర్టు అసహనం వ్యక్తం చేసింది. బాధ్యతాయుతమైన మీడియా ఇటువంటి చర్యలకు దూరంగా ఉండాలని కోర్టు సూచించింది.

## ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా గొంతు నొక్కుతున్నారు..

(మొదటిపేజీ తరువాయి)

ఆయన పార్టీ శాసనసభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాన పార్టీ అయిన వైసీపీకి ప్రతిపక్ష నేత హోదా ఇచ్చేందుకు ప్రభుత్వం ఇష్టపడటం లేదని, అందుకే ప్రజా సమస్యలను మీడియా ద్వారానే ప్రజల దృష్టికి తీసుకెళ్లి నాణేనికి మరోవైపు చూపిస్తానని స్పష్టం చేశారు. శాసనమండలిలో వైసీపీకి ఉన్న బలాన్ని ఉపయోగించుకుని ప్రజావాణిని బలంగా వినిపించాలని జగన్ సూచించారు. “గత 74 రోజులుగా డీఎస్సీ కుంభకోణంపై 10 రకాల నిరసనలు చేపట్టాం. పేపర్ లీకేజీ, ఔట్‌సోర్సింగ్ కుంభకోణాలు, స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు, ప్రభుత్వ ఉత్తర్వుల మార్పు వంటి అంశాలను ఆధారాలతో సహా బయటపెట్టాం. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రమేయంపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశాం” అని జగన్ వివరించారు.

# నేర దర్యాప్తులో ‘గోల్డెన్ అవర్’ కీలకం

(మొదటిపేజీ తరువాయి)

అత్యంత కీలకమని చంద్రబాబు అన్నారు. “రాష్ట్ర ప్రభుత్వానికి పోలీసు విభాగం ఒక గర్వకారణం. ప్రజల విశ్వాసాన్ని చూరగొనేలా మీరంతా వ్యవహరించాలి. ఇన్విజిబుల్ పోలీస్, విజిబుల్ పోలీసింగ్ విధానాన్ని పక్కాగా అమలు చేయాలి” అని ఆయన సూచించారు. 2019-24 మధ్య పాలకులు గంజాయి, కల్తీ మద్యాన్ని రాష్ట్రానికి పెను సమస్యగా మార్చారని ఆరోపించారు. తమ ప్రభుత్వంలో పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తామని, వారి గౌరవం పెరిగేలా అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 14,770 ప్రభుత్వ సీసీ కెమెరాలతో పాటు, ప్రైవేటు వ్యక్తుల కెమెరాలను కలిపి మొత్తం లక్ష కెమెరాలను నేర నియంత్రణ కోసం అనుసంధానించామని తెలిపారు. ఫేస్ రికగ్నిషన్, డీఎన్ఏ డిటెక్షన్ వంటి ఆధునిక టెక్నాలజీతో నేరాలను వేగంగా ఛేదిస్తున్నామని అన్నారు.

### వివేకా కేసులో అది కాస్ట్ లీ మిస్టేక్

రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని సీఎం ఆదేశించారు. “పరామర్శల పేరుతో రోడ్లపై విన్యాసాలు చేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇబ్రహీంపట్నంలో మోటార్ సైకిల్ విన్యాసాలు, విశాఖలో మూడు గంటల పాటు రోడ్లు దిగ్బంధించడం వంటివి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తాయి. ప్రస్తుతం రోడ్లపై వీరంగం సృష్టిస్తున్న వారిలో 94 శాతం మంది ఒకే పార్టీకి చెందిన వారు. ఏ పార్టీకి కూడా చట్టాన్ని ఉల్లంఘించే లైసెన్స్ లేదు” అని చంద్రబాబు హెచ్చరించారు. వివేకానందరెడ్డి హత్య కేసులో ఆధారాలను చెరిపేసే ప్రయత్నం జరగడం పోలీసుల వైపు నుంచి జరిగిన అత్యంత ఖరీదైన తప్పిదం (కాస్ట్ లీ మిస్టేక్) అని అన్నారు. నేరం జరిగిన ప్రాంతాన్ని సంరక్షించడంలో వైఫల్యం ఎంతటి నష్టాన్ని కలిగిస్తుందో ఈ ఘటనే నిదర్శనమని, నేరస్తుల పట్ల ఉదాసీనత వద్దని స్పష్టం చేశారు.

### ఇకపై నెలవారీ పెర్ఫార్మెన్స్ రిపోర్ట్

శాంతిభద్రతల విషయంలో ఏపీని దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా నిలపాలన్నదే తన లక్ష్యమని చంద్రబాబు తెలిపారు. ఇకపై ప్రతీ నెలా పోలీసు శాఖ పనితీరుపై ఒక పెర్ఫార్మెన్స్ రిపోర్టును విడుదల చేయాలని ఆదేశించారు. దీని ద్వారా ఉత్తమ పనితీరు కనబరిచిన వారిని, సక్సెస్ స్టోరీలను ప్రజలకు వివరించవచ్చని అన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం పూర్తిస్థాయిలో అమలు కావాలని, అదే సమయంలో సంఘ విద్రోహ శక్తులకు పోలీసులంటే భయం కలగాలని సూచించారు. మహిళలపై నేరాల విషయంలో జీరో టాలరెన్స్ విధానం కొనసాగుతుందని, ‘డ్రగ్స్ వద్దు బ్రో’ వంటి ప్రచారాలతో గంజాయి, మాదకద్రవ్యాలపై యుద్ధం ప్రకటించాలని పిలుపునిచ్చారు. రహదారి భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి, ప్రమాదాల నివారణకు రోడ్ ఇంజనీరింగ్, హాట్‌స్పాట్‌ల ఆడిట్‌పై దృష్టి సారించాలని కోరారు. ఈ సమావేశంలో హోం మంత్రి వంగలపూడి అనిత, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, శాంతి భద్రతల అదనపు డీజీ ఎన్. మధుసూధన రెడ్డి, ఇంటెలిజెన్స్ చీఫ్ మహేష్ చంద్ర లడ్హా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1200 పోలీస్ స్టేషన్ల నుంచి శాంతిభద్రతలు, ట్రాఫిక్, జీఆర్పీ సహా వివిధ విభాగాల అధికారులు ఈ వర్చువల్ సమావేశంలో పాల్గొన్నారు.

# ఎన్డీఎస్ఏ సూచనల మేరకే మేడిగడ్డ పునరుద్ధరణ

(మొదటిపేజీ తరువాయి)

వినియోగించుకోవాలని ఆదేశించారు. దేవాదుల నుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా 9 పంపులతో ఎత్తిపోతలు చేపట్టామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి ఎత్తిపోతలకు సంబంధించి ఏవైనా చిన్న చిన్న సమస్యలుంటే వాటి పరిష్కారంపై అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించాలని సీఎం సూచించారు. గోదావరి జలాలు సముద్రంలో కలవకుండా సాధ్యమైనంత వరకు ఎత్తి పోసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ ఏడాది సాగు, తాగు నీరుకు ఇబ్బందులు లేకుండా నీటి పారుదల శాఖ అధికారులు ముందస్తు ప్రణాళికతో ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టాలన్నారు. రాష్ట్రంలో చివరి దశలో ఉన్న పలు ప్రాజెక్టుల కింద కొన్ని గ్రామాలు, కొద్ది పాటి వ్యవసాయ భూములకు పరిహారం చెల్లింపు అంశాలు పెండింగ్‌లో ఉన్నాయనీ, వాటిని వెంటనే చెల్లించేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. భూములు కోల్పోయిన రైతులు, ఆస్తులు కోల్పోయిన ప్రజలకు పరిహారం చెల్లింపులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి పారుదల, రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ముంపు గ్రామాలు వాస్తవ పరిస్థితి, పరిహారం, పునరావాసానికి సంబంధించి నివేదిక రూపొందించాలన్నారు. తక్షణ ప్రభావం పడే గ్రామాలకు వెంటనే పరిహారం చెల్లించాలని సూచించారు. హుస్నాబాద్ నియోజక వర్గంలోని బస్వాపూర్, గౌరవెల్లి ప్రాజెక్టులకు సంబంధించి మిగిలిన చిన్న చిన్న పనులు పూర్తి చేస్తే నీరు నింపే అవకాశం ఉంటుందని సీఎం తెలిపారు. ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గట్టు, గూడెందొడ్డి ఎత్తిపోతల పథకం సామర్థ్యం పెంపునకు సంబంధించి సమగ్ర అధ్యయనం చేయాలని రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సేకరించాల్సిన భూమి, పరిహారం, ఇతర అంశాలపై నివేదిక రూపొందించాలన్నారు.

గూడెందొడ్డి పంప్డ్‌స్టోరేజీ ప్రాజెక్టుకు సంబంధించి కన్సల్టెంట్ ను నియమించాలని ఆదేశించారు. కన్సల్టెంట్ నియామకంలో నైపుణ్యం, గత చరిత్రను పరిగణలోకి తీసుకుని ఎంపిక చేయాలన్నారు. గోదావరి, కృష్ణా బేసిన్లలోని ఆయకట్టు కింద ఉన్న రైతులు ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమీక్షలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి వి.శేషాద్రి, సెక్రటరీ మాణిక్ రాజ్, రాష్ట్ర నీటి పారుదల శాఖ కార్యదర్శి ఈ.శ్రీధర్, ఆర్అండ్ఆర్ కమిషనర్ శివ కుమార్ నాయుడు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రాజ్యసభలో లుంగీవాలా వ్యాఖ్యలపై రగడ

- దక్షిణాది ప్రజలను అవమానించిన బీజేపీ ఎంపీ
- దాన్ని సమర్థించిన కేంద్ర మంత్రులు నడ్డా, రిజిజు
- తీవ్రంగా వ్యతిరేకించిన ప్రతిపక్షం
- ఆమె వ్యాఖ్యలపై నిరసనగా లుంగీలతో సభకు హాజరైన విపక్ష ఎంపీలు



న్యూఢిల్లీ – సూర్య వాస్తవం

పార్లమెంటులో దక్షిణాది ప్రజలందరినీ అవమానించిన బీజేపీ ఎంపీ సుష్మితా దేవ్‌కు కేంద్ర ప్రభుత్వం, బీజేపీ పూర్తి మద్దతు ప్రకటించాయి. చర్చలో పాల్గొని, మాట్లాడుతూ సీపీఐ(ఎం) రాజ్యసభ నాయకుడు జాన్ బ్రిట్టాస్‌ను ‘లుంగీవాలా... లుంగీవాలా’ అంటూ పదేపదే అవమానించిన సుష్మితా దేవ్‌కు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, రాజ్యసభ నాయకుడు జెపి నడ్డా మద్దతుగా నిలిచారు. బుధవారం సభాపతి అనుమతితో జాన్ బ్రిట్టాస్ సభలో సుష్మితా దేవ్ చేసిన అవమానకర వ్యాఖ్యలను ప్రస్తావించారు. “నేను ఒక దక్షిణాది భారతీయుడిగా, ఒక మలయాళీగా చాలా గర్వపడుతు న్నాను. మలయాళ భాష, సంస్కృతి, వస్త్రధారణ, ఆహారం మొదలైన వాటి పట్ల కూడా నేను గర్వపడుతున్నాను. పార్లమెంట్ సభ్యురాలిగా చర్చలో పాల్గొంటూ, మాట్లాడుతూ అధికార పార్టీ ఎంపీ మరో పార్టీ ఎంపీని ‘లుంగీవాలా’ అని అవమానించారు. సభలో వాగ్వాదాలు సహజం. కానీ ఇక్కడ, జనాభాలోని ఒక వర్గాన్ని అవమానించడానికి లుంగీని ఒక ఆయుధంగా ఉపయోగించారు” అని ఆయన అన్నారు. ప్రతిపక్ష సభ్యులు జాన్ బ్రిట్టాస్‌కు మద్దతు ఇవ్వడంతో... అధికార పార్టీ అనవసరంగా గందరగోళం సృష్టించి సుష్మితను సమర్థించేందుకు ప్రయత్నించింది. దీంతో సభాపతి సి.పి. రాధాకృష్ణన్ జోక్యం చేసుకోవలసి వచ్చింది.

“సభ్యుల సాంస్కృతిక విలువలను అవమానించే వ్యాఖ్యలు చేయకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలి. ఇద్దరు సభ్యులను సభకు పిలిచి ఈ విషయంపై చర్చిస్తాం” అని ఆయన అన్నారు. దీని తర్వాత, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ... సుష్మిత వాదన కూడా వినాలని వాదించారు. “బ్రిట్టాస్ చెప్పింది రికార్డులో ఉంది. అయితే, సుష్మిత వాదన కూడా వింటేనే ఇరుపక్షాలకు న్యాయం జరుగుతుంది” అని రిజిజు డిమాండ్ చేశారు. రాజ్యసభ నాయకుడు జె.పి నడ్డా మాట్లాడుతూ, మనం లుంగీని ధోతీ అని పిలుస్తామని, అన్ని రకాల దుస్తుల పట్ల మనకు గౌరవం ఉందని తెలిపారు. సుష్మిత వాదన కూడా వినాలని ఆయన కోరారు. రిజిజు, నడ్డా మాట్లాడుతుండగా, బీజేపీ మహిళా సభ్యులు వారి వెనుక వరుసగా నిలబడి జాన్ బ్రిట్టాస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నానాయాగీ చేశారు. భారీ గందరగోళం అనంతరం సభ వాయిదా పడిన తర్వాత, సుష్మితా దేవ్‌కు కూడా మాట్లాడే అవకాశం ఇచ్చారు. తాను ఎలాంటి దూషణాత్మక వ్యాఖ్యలు చేయలేదని, అనవసరమైన అపార్థాలను సృష్టించే ప్రయత్నమే ఈ వివాదమని ఆమె చెప్పారు. సుష్మితా దేవ్ చేసిన అవమానానికి నిరసనగా రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గేతో సహా పలువురు సభ్యులు లుంగీ ధరించి పార్లమెంటులోకి ప్రవేశించారు. పార్లమెంటు బయట కూడా ప్రతిపక్ష సభ్యులు ‘లుంగీవాలా’ అనే అవమానానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. కేరళతో సహా దక్షిణ భారత రాష్ట్రాల పట్ల సంఘ్ పరివార్, బీజేపీలకు ఉన్న తీవ్ర ద్వేషానికి కమలం పార్టీ ఎంపి చేసిన దూషణాత్మక వ్యాఖ్యలు తాజా ఉదాహరణ అని ఎంపీలు అన్నారు.

### పార్లమెంట్ ఆవరణంలో ఆందోళన

రాజ్యసభలో ‘లుంగీవాలా’ వివాదం దక్షిణ భారతదేశంలో బీజేపీకి పెద్ద ఎదురుదెబ్బగా మారనుంది. దక్షిణ భారతీయులందరినీ అవమానించడానికే బీజేపీ ఉద్దేశపూర్వకంగా ఈ చర్యకు పాల్పడిందని తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఈ అవమానానికి వ్యతిరేకంగా జరిగిన నిరసనలో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్నాటక వంటి దక్షిణ భారత రాష్ట్రాలకు చెందిన ప్రతిపక్ష ఎంపీలు పాల్గొన్నారు. పరిస్థితి చేయిదాటిపోతుండటంతో సుష్మితా దేవ్ ఈ అంశానికి మతపరమైన రంగు పులిమి, జాన్ బ్రిట్టాస్‌ను హిందూ వ్యతిరేకిగా చిత్రీకరించడానికి ప్రయత్నించారు. కానీ ఆ ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి.

### ఏం జరిగింది?

యూపీఐ లావాదేవీలపై అదనపు రేట్లు విధించడానికి వీలు కల్పించే సవరణ బిల్లుకు వ్యతిరేకంగా జాన్ బ్రిట్టాస్ సోమవారం ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని, ఆర్థిక మంత్రిని విమర్శిస్తున్నప్పుడు సుష్మితా దేవ్ తన సీటును వదిలి జాన్ బ్రిట్టాస్ వెనుకే కూర్చుని... “లుంగీవాలా... లుంగీవాలా” అంటూ ఆయనను అవమానించారు. నిరంతర వేధింపులను భరించలేక బ్రిట్టాస్ “పార్టీ ఫిరాయింపుదారులు మరింత ఉత్సాహంగా ఉంటారు” అని బదులిచ్చారు. కాంగ్రెస్ నుండి తృణమూల్ కాంగ్రెస్‌కు, అక్కడి నుంచి బీజేపీకి ఫిరాయించిన సుష్మితా దేవ్‌ను ఎగతాళి చేసే ఉద్దేశంతో ఈ వ్యాఖ్య చేశారు. ?కాగా ‘ఉత్సాహం’ అనే పదం ‘హిందువులను’ ఉద్దేశించినట్టుగా సుష్మిత చిత్రీకరించడానికి ప్రయత్నించారు. ఆమె ఈ విషయాన్ని బీజేపీ నాయకులకు తెలియజేసిన తర్వాత, వారు చర్చ కార్యకలాపాలకు సంబంధించిన పూర్తి వీడియోను పరిశీలించారు. కానీ సుష్మిత ఆరోపణలు నిరాధారమైనవని వారు గ్రహించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన బీజేపీ సభ్యుడు సుకేందు శేఖర్ రాయ్‌తో సహా పలువురు నాయకులు, ఈ విషయంలో సుష్మితదే తప్పు అని నాయకత్వానికి రహస్యంగా తెలియజేశారు. జాన్ బ్రిట్టాస్ సుష్మితకు జారీ చేసిన ఉల్లంఘన నోటీసుపై చైర్మెన్ కఠిన చర్యలు తీసుకున్నారు. నోటీసులో బ్రిట్టాస్‌కు మాట్లాడే అవకాశం కల్పించారు. ఏ సభ్యుడు కూడా తన సహచరుల సాంస్కృతిక లక్షణాలను అవమానించే విధంగా జోక్యం చేసుకోకూడదని కూడా ఆదేశించారు.

### మోడీ, షా గైర్హాజరు
### ఏ ప్రశ్నకైనా సమాధానం చెప్తా : అమిత్ షా

ఆయన ప్రసంగంపై ఎవరికీ ఆసక్తి లేదు : రాహుల్ గాంధీ

పార్లమెంటు వర్షాకాల సమావేశాలు షెడ్యూల్ ప్రకారం గురువారంతో ముగియాల్సి ఉన్నాయి. ఈ తరుణంలో ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా బుధవారం కూడా ఉభయ సభలకు గైర్హాజరయ్యారు. రామ మందిర విరాళాల చోరీ, జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై పోలీసు చర్య వంటి సమస్యలపై వివరించే ధైర్యం, ఆత్మవిశ్వాసం వారికి లేవనీ, అందుకే వారిద్దరూ సభకు రావడం లేదని ప్రతిపక్షాలు వారిని ఎగతాళి చేశాయి.

# సంపాదకీయం

## వాయిదాల లోక్‌సభ.. ఎవరికి ఉపయోగం?



ప్రజా సమస్యలపై చర్చలు జరపాల్సిన లోక్‌సభ డెడ్‌లాక్ నిరంతరం కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వ విధానాలు లేదా ఏవైనా వివాదాస్పద అంశాలపై చర్చ జరగాలని విపక్షాలు పట్టుబట్టడం సహజమే అయినప్పటికీ, ప్రభుత్వం ఒక నిర్దిష్ట అంశంపై చర్చకు సిద్ధమని ప్రకటించినా , స్పీకర్ సమయం కేటాయించినా.. మరో అంశాన్ని ముందుకు తెస్తూ సభను స్తంభింపజేయడం ప్రజాస్వామ్య వ్యవస్థలకే సవాలుగా మారుతోంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో ప్రతిపక్షాలు వివిధ అంశాలపై చర్చలతో పాటు మంత్రుల ప్రకటనలు, రాజీనామాలను డిమాండ్ చేస్తూ నిరసనలకు దిగడం వల్ల ప్రశ్నోత్తరాల సమయం, జీరో అవర్ దాదాపుగా కొట్టుకుపోయాయి. ప్రభుత్వం కొన్ని కీలక బిల్లులపై చర్చకు సిద్ధపడినా, ఇతర ప్రాధాన్యతలపై విపక్షాల సభా దిగ్బంధం వల్ల అనేక బిల్లులు చర్చలు లేకుండానే ఆమోదం పొందాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పార్లమెంట్ కార్యకలాపాలు సాఫీగా సాగడానికి ప్రజల సొమ్ము కోట్లాది రూపాయలు వెచ్చిస్తుంటే, రోజూ సభ వాయిదాలు పడటంతో ప్రజ సమస్యలు పక్కనపడిపోతున్నాయనే విమర్శలు జాతీయ మీడియాలో ప్రధానంగా వస్తున్నాయి. ఈ తరహా సభా దిగ్బంధం వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉన్నప్పటికీ, అసలేమీ చర్చ జరగకుండా సభ వాయిదా పడటం కంటే.. ఏ ఒక్క అంశం పైనైనా సభలో ఫలవంతమైన చర్చ జరగడం ప్రజాస్వామ్యానికి ఎంతో శ్రేయస్కరం. నీట్ అక్రమాలపై ఢిల్లీలో నిరసనలకు దిగిన విద్యార్థులపై పోలీసుల దాడులపై ఇప్పటివరకూ పార్లమెంట్ కు వచ్చి సమాధానం చెప్పకుండా తప్పించుకుంటున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముప్పేట దాడి నేపథ్యంలో వెనక్కి తగ్గారు. అమిత్ షాను ఎలాగైనా పార్లమెంట్ కు రప్పించాలని విపక్షాలు పార్లమెంట్ ఉభయసభల్ని స్తంభింపచేస్తున్న వేళ.. ఎట్టకేలకు అమిత్ షా తన నిర్ణయం మార్చుకున్నారు. పార్లమెంట్ కు హాజరై ఢిల్లీ పోలీసుల దాడులపై సమాధానం ఇవ్వాలని నిర్ణయించారు. నీట్ అక్రమాల నేపథ్యంలో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ గత నెలలో విద్యార్థులు కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో పార్లమెంట్ మార్చ్ కు బయలుదేరారు. వీరిని అడ్డుకునేందుకు ఢిల్లీ పోలీసులు లాఠీఛార్జ్, బాష్పవాయువు ప్రయోగాలతో పాటు పెల్లెట్ గన్ లను కూడా ప్రయోగించారు. అలాగే మేకులు కొట్టిన లాఠీలతో బాదడం, ఎలక్ట్రిక్ బేటన్లతో కొట్టడం చేశారు. దీంతో భారీ సంఖ్యలో విద్యార్థులు గాయాలపాలయ్యారు. వీరిని వివిధ ఆస్పత్రుల్లో కేంద్రమంత్రులు పరామర్శించారు. అప్పటి నుంచీ ఈ దారుణాలపై హోంమంత్రి అమిత్ షా సమాధానం కోసం విపక్షాలు పట్టుబడుతున్నా కేంద్రం ఒప్పుకోవడం లేదు ఈ నేపథ్యంలో విపక్షాలు నిత్యం ఉభయసభల్ని స్తంభింపచేస్తున్నా అమిత్ షా మాత్రం సభకు రావడం లేదు. దీంతో ఓ దశలో రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ కూడా విపక్షాల డిమాండ్ ప్రకారం అమిత్ షాను సభకు రప్పించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజుకు సూచించారు. దీంతో పరీక్షల అవకతవకలకు వ్యతిరేకంగా జరిగిన నిరసనల సందర్భంగా ఢిల్లీలో పెల్లెట్ గన్‌లు, బీహార్‌లో ఏకే-47లను ఉపయోగించడంపై హోం మంత్రి అమిత్ షా పార్లమెంటులో హాజరై వివరణ ఇవ్వాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌కు అంగీకరిస్తున్నట్లు, పోలీసుల చర్యతో సహా విద్యార్థుల నిరసనలకు సంబంధించిన ప్రతి అంశంపై పార్లమెంటులో చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. అయితే సభా కార్యకలాపాల సమయంలో ప్రతిపక్షాలు హంగామా సృష్టించకూడదని మంత్రి షరతు పెట్టారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం ప్రతిపక్షాల హక్కు అయినప్పటికీ, అది ప్రజా ప్రయోజనాలకు విఘాతం కలగకుండా సభ సజావుగా సాగేందుకు తోడ్పడేలా ఉండాలన్నది రాజ్యాంగ నిపుణుల భావన. చర్చల ద్వారా మాత్రమే విధాన నిర్ణయాల్లో లోపాలను సరిదిద్దడం, ప్రభుత్వ జవాబుదారీతనాన్ని నిర్ధారించడం సాధ్యమవుతుంది.

రామమందిర విరాళాలపై అమిత్ షా చేసిన ప్రకటనపై ప్రతిపక్ష కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్‌లో మంగళవారం కూడా నిరసన చేపట్టారు. మాకు అడ్డంకులు సృష్టిస్తారా అంటూ పాలక పక్ష ఎన్‌డీఏ ఎంపీలు పోటీగా నిరసన చేపట్టారు. పార్లమెంట్ ప్రధాన ద్వారాల్లోని ఒకటైన మకర ద్వారం వద్ద ప్రతిపక్ష, పాలక పక్ష ఎంపీలు పోటాపోటీగా నినాదాలు చేశారు. ఢిల్లీలో విద్యార్థి నిరసనకారులపై పోలీసుల అణచివేత, రామ మందిరం విరాళాల దుర్వినియోగంపై హోం మంత్రి అమిత్ షా పార్లమెంటుకు వచ్చి చర్చించాలని ప్రతిపక్ష ఎంపీలు పట్టుబట్టారు. కాంగ్రెస్ నేతృత్వంలోని జార్ఖండ్‌లో నిరసనలు చేపట్టిన విద్యార్థులపై హేమంత్ సొరేన్ ప్రభుత్వం లాఠీచార్జీ జరిపించిందని, దీనిపై చర్చించడానికి రాహుల్‌గాంధీ పారిపోతున్నారని, డబుల్ గేమ్ ఆడుతున్నారని ఆరోపిస్తూ పాలక పక్ష ఎంపీలు ఎదురు నిరసనలు చేపట్టారు. పార్లమెంటు ను ఉద్దేశించి ప్రసంగించడానికి, ప్రతిపక్షాల ప్రశ్నలకు బదులివ్వడానికి అమిత్ షా సిద్ధంగా ఉన్నారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. అయినా ప్రతిపక్ష ఎంపీలు తమ నిరసన కొనసాగించారు. రామ మందింలో విరాళాల దుర్వినియోగంపై ప్రతిపక్ష ఎంపీలు ఒక స్కిట్ ఈ నిరసనలో ప్రదర్శించారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి , స్పీకర్ నేతృత్వంలో విపక్ష నేతలతో చర్చలు జరిపి సభా స్థంభనను తొలగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ.. ఉభయ పక్షాల మధ్య సమ్మతి కొరవడటంతో గందరగోళం కొనసాగుతోంది. ఏదేమైనా, విపక్షాలు వాకౌట్‌లు లేదా ఆందోళనలతో సమయాన్ని వృథా చేయకుండా, దొరికిన అవకాశాన్ని ఉపయోగించుకుని ప్రభుత్వం ఇచ్చే చర్చల్లో పాల్గొనడమే ప్రజాస్వామ్య బలాన్ని పెంచుతుంది. ఢిల్లీ ఘటనపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సమాధానం చెప్పి తీరాల్సిందేనని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. విద్యార్థులపై దాడి ఘటనపై ప్రకటన ఇవ్వడానికి ఆయన పార్లమెంట్‌కు రావాల్సిందేనని పట్టుబట్టారు. పోలీసుల దాడిలో యువతులు, మైనర్లు గాయపడ్డారని అన్నారు. కాల్పులపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరగాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.


ఫైల్ ఫోటో

# రేషన్ బియ్యం మాఫియాకు అడ్డుకట్ట ఎక్కడ..?

- పట్టపగలే ఇళ్లకు వెళ్లి రేషన్ బియ్యం సేకరణ
- సరిహద్దులు దాటుతున్న అక్రమ రవాణా.. నిఘా వ్యవస్థపై అనుమానాలు
- ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్

**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :**
పేదల ఆహార భద్రత కోసం ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతోందనే ఆరోపణలు అనంతపురం జిల్లాలో ఆందోళన కలిగిస్తున్నాయి. అనంతపురం, ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం, గుంతకల్లు నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాల్లో కొందరు వ్యక్తులు లబ్ధిదారుల ఇళ్లకు నేరుగా వెళ్లి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారనే ఫిర్యాదులు వినిపిస్తున్నాయి.

### పెరిగిన బియ్యం ధరలతో అక్రమ వ్యాపారానికి ఊతం?

మార్కెట్‌లో బియ్యం ధరలు పెరగడంతో రేషన్ బియ్యం అక్రమ కొనుగోళ్లు, తరలింపులు పెరిగినట్లు స్థానిక వర్గాలు చెబుతున్నాయి. కొందరు వ్యక్తులు కిలోకు రూ.15 నుంచి రూ.19 వరకు చెల్లించి లబ్ధిదారుల నుంచి బియ్యం సేకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అనంతరం సరిహద్దులు దాటి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారికంగా ధృవీకరణ రావాల్సి ఉంది. అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి వాస్త వాలను వెలుగులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

### రాజకీయ అండ ఉందా?

పలు గ్రామాల్లో కొందరు వ్యక్తులు రాజకీయ నాయకుల అనుచరులుగా చెప్పుకుంటూ రేషన్ బియ్యం సేకరణలో మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సేకరించిన బియ్యాన్ని కర్ణాటకలోని పలు ప్రాంతాలకు తరలిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ వ్యవహారంలో ఎవరి పాత్ర ఉన్నా ఆధారాలతో గుర్తించి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కర్ణాటకకు అక్రమ రవాణాపై నిఘా ఏది? రాయదుర్గం, కళ్యాణదుర్గం, డి.హీరేహాళ్, కణేకల్లు తదితర సరిహద్దు ప్రాంతాల నుంచి కర్ణాటక వైపు రేషన్ బియ్యం తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బళ్లారి, రాంపురం, చెళ్లకెర, వైఎన్. హొసకోట, పావగడ, తుమకూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు స్థానిక వర్గాలు పేర్కొంటు న్నాయి. రేషన్ బియ్యాన్ని అక్రమంగా సేకరించి ఇతర ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలపై సంబంధిత అధికారులు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉంది.

### కీలక పాత్రపై ఆరోపణలు

రాయదుర్గం, ఉరవకొండ ప్రాంతాల్లో రేషన్ బియ్యం తరలింపు వ్యవహారంలో ఓ మహిళ కీలకంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు ఇప్పటివరకు అధికారిక ధృవీకరణ లేదు. ఆరోపణల్లో వాస్తవమెంత? ఎవరి ప్రమేయం ఉంది? అనే అంశాలపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

### నిఘా వ్యవస్థపై అనుమానాలు

అప్పుడప్పుడు విజిలెన్స్, పోలీసు అధికారులు తనిఖీలు నిర్వహించి రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుంటున్నప్పటికీ, అక్రమ రవాణాకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.
నిఘా వ్యవస్థకు నెలవారీగా మామూళ్లు అందుతున్నాయనే ఆరోపణలు కూడా కొందరి నుంచి వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేదా అధికారిక ధృవీకరణ వెలువడలేదు. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై, తప్పుదోవ పట్టించే ఆరోపణలైతే సంబంధిత వాస్తవాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

### సీఎస్ఓ, పోలీసు శాఖల సమన్వయంతో నిఘా పెంచాలి

రేషన్ బియ్యం అక్రమ కొనుగోళ్లు, నిల్వలు, రవాణాపై సివిల్ సప్లైస్, పోలీసు, విజిలెన్స్ శాఖలు సమన్వయంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. సరిహద్దు ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు, అనుమానాస్పద నిల్వ కేంద్రాల పరిశీలన, ఫిర్యాదులపై తక్షణ స్పందన వంటి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### రేషన్ బియ్యం పేదల హక్కు.. అక్రమ వ్యాపారానికి కాదు

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం అర్హులైన కుటుంబాల ఆహార భద్రతకు ఉపయోగపడాలన్నదే ప్రధాన ఉద్దేశం. సబ్సిడీతో అందుతున్న బియ్యం అక్రమంగా కొనుగోలు, విక్రయాలు, రవాణాకు గురైతే ప్రభుత్వ పథకం లక్ష్యం దెబ్బతినే అవకాశం ఉంది. లబ్ధిదారులు కూడా తమకు అందుతున్న బియ్యాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని, అక్రమంగా కొనుగోలు చేసే వ్యక్తులకు విక్రయించకుండా అప్రమత్తంగా ఉండాలని సామాజికవేత్తలు సూచిస్తున్నారు.

### ఆధారాలతో చర్యలు తీసుకోవాలి

రేషన్ బియ్యం అక్రమంగా కొనుగోలు చేస్తున్నా, నిల్వ చేస్తున్నా, తరలిస్తున్నా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. అదే సమయంలో కేవలం ఆరోపణల ఆధారంగా కాకుండా ఆధారాలు సేకరించి, పూర్తి స్థాయి విచారణ అనంతరం బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
పేదల కోసం ఉద్దేశించిన రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా నిరంతర నిఘా, పారదర్శక తనిఖీలు, కఠినమైన అమలు చర్యలు అవసరమని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.


ఫైల్ ఫోటో

# బలవంతపు నిరసనలతో బలం పెరిగేనా

**నెల్లూరు - సూర్య వాస్తవం**



వైఎస్ జగన్ వ్యూహం తప్పుతున్నట్లు కనిపిస్తుంది. ఆయన మెగా డీఎస్సీలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు చేయడమే కాకుండా దీనికి ఎండ్ కార్డు మాత్రం పడే అవకాశం లేదు. టీడీపీ ప్రస్తుతం కూటమిలో ఉంది. కేంద్ర ప్రభుత్వానికి చంద్రబాబు అవసరం ఎంతో ఉంది. కేంద్రం నుంచి కూడా స్పందన వచ్చే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో ఈ పోరు కు అంతం లేదు. కాకుంటే ఆంధ్రప్రదేశ్ లో నిరుద్యోగ యువత నుంచి కొంత మద్దతు దొరుకుతుందేమోనని వైసీపీ భావించి మెగా డీఎస్సీలో అవకతవకలంటూ ఆందోళనలు, నిరసనలు కంటిన్యూ చేస్తుంది. ఈ ఆందోళనల్లో పాల్గొంటున్న వైసీపీ నేతలకే దీని వల్ల రాజకీయ ప్రయోజనం ఎంత వరకూ వస్తుందన్నది కూడా అంతు చిక్కకుండా ఉంది. కానీ పార్టీ అధినాయకత్వం ఆదేశాల మేరకు ఆందోళనలు చేయాల్సి వస్తుందని అంటున్నారు. వైసీపీ చేపట్టిన ఆందోళనల వల్ల ప్రయోజనం ఎంత మేరకు ఉంది? బలవంతపు నిరసనలుగానే కనిపిస్తుంది. ఈ ఆందోళనల్లో యువత పెద్దగా పాల్గొనకపోవడం కూడా చర్చనీయాంశమైంది. టీడీపీ దీనిని హైలెట్ చేస్తుంది. మెగా డీఎస్సీ రాసిన వారు ఎవరూ ఈ ఆందోళనల్లో పాల్గొనకపోవడంతోనే వైసీపీ ఆందోళనలు, నిరసనలు వృధా ప్రయాస అని అంటున్నారు. కానీ ఒకసారి బరిలోకి దిగి వెనక్కు తగ్గకూడదన్న ఏకైక కారణంతోనే వైసీపీ నేతలు ఆందోళనలు కొనసాగిస్తున్నారన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి.
వైసీపీ ఏ అంశంలోనైనా దానిని తుది వరకూ తీసుకెళ్లగలమన్న నమ్మకం ఉంటేనే కొనసాగించాలని, లేకుంటే కొన్ని రోజులు ఆందోళనలు చేసి వదిలేస్తే మంచిదన్న సూచనలు కూడా వెలువడుతున్నాయి. కానీ జగన్ మాత్రం మెగా డీఎస్సీపై ఆందోళనలు, నిరసనలు వ్యక్తం చేయాల్సిందేనన్న ఆదేశాలు ఇవ్వడంతో నేతలు విధిలేని పరిస్థితుల్లో చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మెగా డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేపట్టిన పోరాటం వల్ల రాజకీయంగా ఆ పార్టీకి పెద్దగా లాభం చేకూరక పోగా, న్యాయ స్థానంలో ఎదురుదెబ్బలు తగులుతు న్నాయి. ఎంపికైన అభ్యర్థులు, ప్రభుత్వం నుంచి వ్యతిరేకత ఎదురవుతోంది. న్యాయస్థానంలో ఎదురు దెబ్బలు మెగా డీఎస్సీ అక్రమాలపై వైసీపీ దాఖలు చేసిన పిల్‌ను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. రాజకీయ ప్రయోజనాల కోసం పిల్స్‌ను వాడరాదని కోర్టు స్పష్టం చేసింది. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు వైసీపీ తీరుపై రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారు. ఇది కేవలం డైవర్షన్ రాజకీయాలంటూ అధికార కూటమి పార్టీ నేతలు ఎదురుదాడి చేస్తున్నారు. మెగా డీఎస్సీ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని ప్రభుత్వం, అభ్యర్థులు చెబుతుండటంతో, ఈ అంశంపై వైసీపీ పోరు జనంలోకి బలంగా వెళ్లడం లేదనే విశ్లేషణలు వస్తున్నాయి. మొత్తం మీద ఈ పోరాటం నిష్ప్రయోజనమేనని అంటున్నారు.

## నీటిపారుదల, రెవెన్యూ శాఖల సమస్యలపై ప్రత్యేక దృష్టి

- అధికారులతో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సమీక్ష
- ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశం
- ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దని సూచన



**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** బండారు శ్రావణిశ్రీ తన క్యాంపు కార్యాలయం లో నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఆయా శాఖలకు సంబంధించిన సమస్యలు, పెండింగ్ అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.అనంతరం స్థానిక గ్రామాల్లో ముఖ్య నాయకులు, ప్రజలను కలిసి వారి సమస్యలు, ఇబ్బందులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకు న్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. ప్రతి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు.ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పనిచేసి, స్పందనలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

## జేఎన్టీయూలో సీఐఐ రీజినల్ కాన్ఫరెన్స్ ఏర్పాట్లు

- వేదిక, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లపై కలెక్టర్ పరిశీలన
- ప్రముఖులు, పారిశ్రామికవేత్తలకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు
- శాఖల వారీగా సమన్వయంతో పనిచేయాలని అధికారులకు ఆదేశం





**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :** జిల్లా కేంద్రంలోని జేఎన్టీయూలో అక్టోబర్ 23న ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఏపీ ఈడీబీ), కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) భాగస్వామ్యంతో నిర్వహించనున్న సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్--2026 రీజినల్ కాన్ఫరెన్స్కు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఎన్టీఆర్ ఆడిటోరియం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్.. కాన్ఫరెన్స్కు హాజరయ్యే ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, ప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను పక్కాగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వేదిక, పార్కింగ్, భద్రత, మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిం చేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

## ఇంటింటి కి జోరుగా టీడీపీ నాయకులు ప్రచారం



**పామిడి- సూర్య వాస్తవం :** పామిడి పట్టణంలోని 6.7 వార్డులో బుధవారం టిడిపి సీనియర్ నాయకులు గుత్తి మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కే.ప్రభాకరచౌదరి మాజీ మున్సిపల్ చైర్మన్ గౌస్ పీరా ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండేళ్ల పాలనలో నిర్వహించిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల గూర్చి ఇంటింటికి వెళ్లి వివరిస్తూ ప్రభుత్వం నుంచి తల్లి దీవన, రైతు భరోసా, నేతన్న నేస్తం, బియ్యం చెక్కర లాంటి లాంటి సంక్షేమాలన్నీ అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రజల యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మరిన్ని సేవలు సంక్షేమాలు ప్రభుత్వం నుంచి అందాలంటే కూటమి ప్రభుత్వానికి చేదోడుగా నిలవాలని,త్వరలో రానున్న స్థానిక ఎన్నికలలో అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కె ప్రభాకరచౌదరి, గౌస్ పీరా టౌన్ కన్వీనర్ బొమ్మ మోహన్ తేల్ భాష వార్డు ఇన్చార్జ్ కె వెంకటేష్, పట్టణ ఉపాధ్యక్షుడు బాబావలి, మాజీ మైనారిటీ అధ్యక్షుడు హుస్సేన్ పీరా తదితరులు పాల్గొన్నారు. ప్రజల నుండి వచ్చిన సమస్యలను మండల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

### పులివెందులను ఫ్యాక్షన్ ప్రాంతంగా

# మార్చింది జగన్ కుటుంబమే

- ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్
- పులివెందులకు పరిశ్రమలు, సాగునీరు తీసుకొచ్చిన ఘనత కూటమిదే
- రాయలసీమకు భారీగా పెట్టుబడులు.. పరిశ్రమల రాక
- ఎమ్మెల్యే దగ్గుపాటికి నాయకులు, కార్యకర్తల ఘన స్వాగతం
- కూటమి పాలనపై ప్రజల్లో సంతృప్తి ఉందన్న ఎమ్మెల్యే
- రెండేళ్లలో రూ.1,296 కోట్ల అభివృద్ధి, సంక్షేమ పనులు



**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** పులివెందులను రెండు తరాలుగా జగన్‌రెడ్డి కుటుంబం ఫ్యాక్షన్ ప్రాంతంగా మార్చిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అదే ప్రాంతానికి పరిశ్రమలు, సాగునీరు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తున్నామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు.31వ డివిజన్‌లో నిర్వహించిన 'ఇంటింటికీ కూటమి ప్రభుత్వం'కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి పాల్గొన్నారు. విద్యుత్‌నగర్ సర్కిల్‌లోని పవిత్ర హైపర్ మార్ట్ వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం కూటమి నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే.. ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతు న్నాయా? సమస్యలు ఏమైనా ఉన్నాయా? అనే విషయాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ప్రజల అభిప్రాయాలను సేకరించారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. 2014-19 మధ్య విభజిత ఆంధ్రప్రదేశ్ ఎన్నో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతితో పాటు రాష్ట్ర అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. అనంతరం జగన్‌రెడ్డి ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని 20 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లిందని విమర్శించారు.చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలోకి తీసుకొచ్చారని దగ్గుపాటి అన్నారు. సూపర్ సిక్స్ హామీల అమలు, మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, అన్న క్యాంటీన్ల పునఃప్రారంభం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్నదాత సుఖీభవ, చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్, ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం వంటి పలు కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేసిందన్నారు.

మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో రాష్ట్రానికి భారీ పెట్టుబడులు వస్తున్నాయని, రాయలసీమకు కూడా పెద్ద ఎత్తున పరిశ్రమలు తరలివస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతిష్టాత్మక కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయని తెలిపారు.అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో గత రెండేళ్లలో రూ.1,296 కోట్ల విలువైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని ఎమ్మెల్యే దగ్గుపాటి తెలిపారు. రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

### ఎల్-నినో నేపథ్యంలో

# తాగునీటి సమస్యపై అప్రమత్తంగా ఉండాలి

- నాలుగు పంచాయతీల అధికారులతో ఎమ్మెల్యే దగ్గుపాటి సమీక్ష
- క్యాంప్ కార్యాలయంలో ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులు, స్పెషల్ ఆఫీసర్లతో సమావేశం
- రోడ్లు, డ్రైనేజీ సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలి
- అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆదేశం



**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** ఎల్-నినో పరిస్థితుల నేపథ్యంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అధికారులను ఆదేశించారు. తన క్యాంప్ కార్యాల యంలో నాలుగు పంచాయతీలకు చెందిన ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, స్పెషల్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించి వివిధ అంశాలపై సమీక్షించారు.ఈ సందర్భం గా పంచాయతీల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని, కొత్తగా చేపట్టాల్సిన పనులకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. పంచాయతీల్లో రోడ్లు, డ్రైనేజీ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రజా దర్బార్‌లో ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను ప్రస్తావిస్తూ పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వీధి దీపాల సమస్యలపై కూడా ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, చిన్నచిన్న సమస్యలు కూడా పునరావృతం కాకుండా అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. ముఖ్యంగా ఎల్-నినో నేపథ్యంలో తాగునీటి లభ్యతపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు ఎక్కడా తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బంది పడకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు.

## నేటి నుండి శ్రీభద్రకాళి వీరభద్రస్వామి శ్రావణమాసం వేడుకలు

### శ్రీగుడ్లవీరన్నపల్లి వీరభద్రేశ్వరస్వామి ఆలయ పూజా కార్యక్రమాలు





**పామిడి- సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా, పెద్దవడుగూరు సమీపాన, పామిడి మండలంలోని తంబళ్లపల్లి గ్రామ పొలిమేరప్రాంతంలో వెలసిన పురాతన ప్రసిద్ధి చెందిన శ్రీగుడ్లవీరన్నపల్లి వీరభద్రేశ్వరకాళి కామాతస్వామి దేవాలయం నేటి నుండి శ్రావణమాస పూజలు ప్రారంభ మహోత్సవ వేడుకలు ప్రారంభించారు. శుక్లపాడ్యమి ఆగస్టు 13 నుంచి బహుళ అమావాస్య సెప్టెంబర్ 11 వరకు ప్రతిరోజు ఉదయం అభిషేక ములు అర్చనలు,ప్రతి సోమవారం గోపూజతో ప్రారంభమై తుందని,ఈనెల 17మొదట "సోమవారం సాయంత్రం 5:15 ని॥లకు ఆధ్యాత్మిక ప్రవచనములు శ్రీసురేంద్ర మహరాజ్, పీఠాధిపతిచే, (దత్తమహాయోగ పీఠము)24న రెండవ సోమవారం 30 వరకు 31 మూడవ సోమవారం సాయంత్రం 5:15 ని॥లకు హనుమాన్ చాలీసా ప్రవ చనము బి. జయరంగారెడ్డి లెక్చరర్ అబ్బేదొడ్డి గ్రామవాస్తవ్యులచే సంగీత సహకారము, విరుపాపురం టీచర్ డి.చితంబర్ రెడ్డి, బళ్ళారిరాఘవ ఆవార్డుగ్రహీతచే,తపలిస్టు నరేష్ సంగీత ఆలాపనలతో సెప్టెంబర్ 7 నాల్గవ సోమవారం సాయంత్రం 4:45 ని॥లకు భగవద్గీత ప్రవచనం స్వామి ఆత్మవిధానందసరస్వతి చిన్మయ్యమిషన్, ( మైసూర్ గణపతి సచ్చిదానంద స్వామిజీ ఆశీస్సులతో) రాఖీ పౌర్ణమి, శ్రావణపౌర్ణమి రక్షాబంధన్ కార్యక్రమం, 28శ్రావణ శుక్రవారం ఉదయం 8:15 ని॥లకు గోపూజతో ప్రారంభం కాశీపవిత్ర గంగాజలంచే వీరభద్ర స్వామికి అభిషేకము, అర్చనలు పూజలు జరుగునని వీరభద్రస్వామి ఆలయకమిటీ,మరియు భక్తాదులు పేర్కొన్నారు. శ్రావణమాస మంతట పలు గ్రామలలోని "భజనమండలి భక్తాదులు" స్వచ్ఛంధముగా భజన చేయుటకు ఆలయకమిటీ వారి దగ్గర పేర్లు నమోదు చేసుకొనవలయును. వారు తెలిపారు. పైకార్యక్రమాలలో సమస్త హిందూ భక్తాదులందరు పాల్గొని వీరభద్రస్వామి కృపకు పాత్రులగుదరని భక్తులకు విజ్ఞప్తి చేశారు.

## కొండయ్య మృతి వైద్య రంగానికి తీరని లోటు

- ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సంతాపం
- కొండయ్య పార్థివ దేహానికి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ నివాళులు
- కొండయ్య కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** ప్రముఖ వైద్యుడు కొండయ్య గుండెపోటుతో మృతి చెందడం పట్ల అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నగరంలోని కొండయ్య నివాసానికి వెళ్లి ఆయన పార్థివ దేహానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం కొండయ్య కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వారికి తన ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలియజేశారు. కొండయ్య మృతి వైద్య రంగానికి, ఆయనను అభిమానించే వారందరికీ తీరని లోటని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.

## వర్షాలు సమృద్ధిగా కురవాలని పొలికిలో ప్రత్యేక పూజలు

- పురాతన బావి నుంచి సోమేశ్వర ఆలయం వరకు భక్తిశ్రద్ధలతో జలయాత్ర
- సోమేశ్వరస్వామికి జలాభిషేకం.. ప్రత్యేక హోమాలు
- పూర్ణకలశాలతో ఘనంగా ఊరేగింపు



**ఉరవకొండ - సూర్య వాస్తవం :** విడపనకల్లు మండలంలోని పొలికి గ్రామంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని కోరుతూ మహిళలు, యువకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సంప్రదాయ బద్ధంగా జలాభిషేకం, హోమాలు, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు.మహిళలు పూర్ణకలశాలతో ముందుకు సాగగా, యువకులు గంగినీటి కడవలను ఎత్తుకొని గ్రామంలోని పురాతన బావి నుంచి శ్రీ సోమేశ్వరస్వామి ఆలయం వరకు మేళతాళాల నడుమ భక్తిశ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయంలో శ్రీ సోమేశ్వరస్వామివారికి జలాభిషేకం చేసి, హోమాలు నిర్వహించారు.ప్రతి ఏటా గ్రామంలోఈ ఆచార సంప్రదాయాలను కొనసాగిస్తున్నామని గ్రామస్తులు తెలిపారు. వేడుకలను వీక్షించేందుకు పొలికి గ్రామ ప్రజలతో పాటు కర్ణాటక ప్రాంతానికి చెందిన భక్తులు కూడా పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వర్షాలు సమృద్ధిగా కురిసి గ్రామంలో సుభిక్షం, పంటలలో మంచి దిగుబడి రావాలని భక్తులు స్వామివారిని ప్రార్థించారు.

## వికసిత్ భారత్జీ జీ రామ్ జి చట్టంపై అవగాహన



**పామిడి- సూర్య వాస్తవం :** పామిడిపట్టణంలోని ప్రజాపరిషత్ అభివృద్ధి కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన ప్రజాప్రతినిధులు అధికారులకు వికసిత్ భారత్ జి రామ్ జి నూతన చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. భారతి పంచ ఈకార్యక్రమంలో జిల్లాపరిషత్ సీఈవో విజయలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వికసిత్ భారతి జీ రామ్ జీ చట్టంపై మండ లంలోని జడ్పిటిసి,టెక్నికల్అసిస్టెంట్లు,ఫీల్డ్ అసిస్టెంట్లు,పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీర్లు, తదితర ఉన్నతాధికారులు సభ్యులతో సీఈవో విజయలక్ష్మి గ్రామాలలో జరిగే అభివృద్ధి పనులపై చర్చించడం జరిగింది. ఈశిక్షణ సదస్సులో పంచసమ్మేళనం పైన అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈవో విజయలక్ష్మి,ఎంపీడీఓ ప్రభాకర్,ఏపీవో ఆదినారాయణమ్మ, తదితర అధికారులు పాల్గొన్నారు.

## రాప్తాడు, ఇటుకలపల్లి, బుక్కరాయసముద్రం

# పోలీస్ స్టేషన్లలో ఎస్పీ ఆకస్మిక తనిఖీలు

- మహిళల భద్రతకు ప్రాధాన్యం.. రాత్రి వేళల్లో ప్రత్యేక గస్తీకి ఆదేశాలు
- సైబర్ మోసాలపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలి
- రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు కఠినంగా అమలు చేయాలి
- ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలి.. వెంటనే స్పందించాలి





**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** పనితీరును మరింత పటిష్టం చేసే దిశగా జిల్లా ఎస్పీ పి. జగదీష్, ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రాప్తాడు, ఇటుకలపల్లి, బుక్కరాయసముద్రం పోలీస్ స్టేషన్లను సందర్శించిన ఎస్పీ.. స్టేషన్ల నిర్వహణ తీరు, కేసుల దర్యాప్తు, రికార్డులు, మౌలిక వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా విజిటర్స్ రిజిస్టర్, స్టేషన్ డైరీ, పెండింగ్ కేసులు, ఎఫ్ఐఆర్ల నమోదు ప్రక్రియతో పాటు వివిధ స్టేషన్ గదులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు.

**మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం**

మహిళల భద్రత విషయంలో పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఆదేశించారు. రాత్రి వేళల్లో ప్రత్యేక గస్తీ నిర్వహించాలని, మహిళల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆపరేషన్ నైట్ సేఫ్టీ, స్త్రీరక్ష పోర్టల్, శక్తి యాప్ వంటి సేవలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు.

**రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు**

జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని ఎస్పీ స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వంటి ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవడంతో పాటు వాహనదారుల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంచాలని సూచించారు.

**సైబర్ మోసాలపై గ్రామస్థాయిలో అవగాహన**

రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. ఆన్లైన్ మోసాలు, సైబర్ క్రైమ్ల పట్ల గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, కరపత్రాల ద్వారా ప్రజలకు సమాచారాన్ని చేరవేయాలని ఆదేశించారు.

**ఫిర్యాదులపై తక్షణ స్పందన**

పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదు దారులతో సిబ్బంది మర్యాదగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. బాధితుల సమస్యలపై అలసత్వం వహించకుండా వెంటనే స్పందించి, అవసరమైన చట్టపరమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

**పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి**

పెండింగ్లో ఉన్న కేసులను త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు సత్వర న్యాయం అందేలా దర్యాప్తు ప్రక్రియను పర్యవేక్షించాలని సూచించారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో సంబంధిత పోలీస్ స్టేషన్ల ఎస్హెచ్ఓలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఈ నెల 17న జిల్లా పోలీస్ హెడ్క్వార్టర్స్లో స్క్రాప్ వేలం

**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలోని ఆర్మ్డ్ రిజర్వ్ (ఏఆర్) హెడ్క్వార్టర్స్ ఏఆర్ స్టోర్లో కాలం చెల్లి, ప్రస్తుతం వినియోగంలో లేని వివిధ రకాల వస్తువులకు ఈ నెల 17న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఏఆర్ అదనపు ఎస్పీ షేక్ ఇలియాస్ బాషా తెలిపారు.వేలంలో మెగాఫోన్లు, బ్యాటరీలు, కేన్ లాఠీలు, మస్కిటో నెట్లు తదితర దాదాపు 30 రకాల స్క్రాప్ వస్తువులను విక్రయానికి ఉంచనున్నట్లు పేర్కొన్నారు.

**వేలం వివరాలు:** తేదీ: ఈ నెల 17, సమయం: ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు

వేదిక: జిల్లా పోలీస్ కార్యాలయం, అనంతపురం. ఆసక్తి ఉన్నవారు వేలంపాటలో పాల్గొనవచ్చని అధికారులు తెలిపారు. వేలానికి సంబంధించిన పూర్తి వివరాలు, నిబంధనల కోసం 9440796859, 9948364934 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

## జనసేన టౌన్ అధ్యక్షున్ని పరామర్శించిన యువనేత గుమ్మనూరు ఈశ్వర్



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి గత కొంతకాలం కింద ట అనారోగ్యం కారణంగా హాస్పిటల్ నందు చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న గుత్తి టౌన్ జనసేన అధ్యక్షుడు సురేష్ పాటిల్ ని ఈరోజు ఆయన నివాసానికి వెళ్లి ఆయన ఆ రోగ్య వివరాలు అడిగి తెలు సుకుని త్వరగా కోలుకోవా లని సూచించిన గుంతకల్ నియోజకవర్గం శాసనసభ్యు లు గుమ్మనూరు జయరాం తనయుడు యువనేత గు త్తి మరియు పామిడి ఇన్చా ర్జి గుమ్మనూరు ఈశ్వర్ ఈ కార్యక్రమంలో గుత్తి పట్టణ మరియు మండల కూటమి నాయకులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించండి - యువనేత గుమ్మనూరు ఈశ్వర్

గుత్తి - సూర్య వాస్తవం : గుత్తి పట్టణంలో బుధవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు గుంతకల్లు నియోజక వర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం కూతురుకి, అనంతపురం జిల్లా అధ్యక్షులు పూల నాగరాజు కుమారుడుకి ఈ నెల 30వ తేదీన జరగబోయే వివాహానికి గుత్తి పట్టణ మరియు మండల కూటమి



నాయకు లు మరియు ప్రజలు అంద రు కచ్చితంగా హాజరై నూత న వధూవరులను ఆశీర్వ దించాలని ఈరోజు గుత్తి ప ట్టణ టీడీపీ కార్యాలయం నందు ఆహ్వానించిన గుంత కల్లు శాసన సభ్యులు గు మ్మనూరు జయరాం తన యుడు యువనేత గుత్తి, పామిడి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్.

## ఘనంగా కాళాపురంలో చౌడమ్మ జయంతి సంబరాలు

**పామిడి- సూర్య వాస్తవం :** పామిడి మండలం కాళాపురం గ్రామంలో మాస శివరాత్రి, చౌడేశ్వరి దేవి అమ్మవారి జన్మదిన వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మంగళవారం మాస శివరాత్రి సందర్భంగా గ్రామంలోని విశ్వేశ్వరస్వామి దేవాలయంలో ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని విశ్వేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు బుధవారం చౌడేశ్వరి దేవి అమ్మవారి జన్మదినాన్ని పురస్కరించుకుని



గ్రామంలోని చేనేత కులస్థులు, గ్రామ ప్రజలు కలిసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందించడంతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించి భోజన సదుపాయం కల్పించారు. రెండు రోజులపాటు జరిగిన ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయాల వద్ద భక్తుల సందడితో పాటు పూజా కార్యక్రమాలు కొనసాగడంతో భక్తుల అమ్మవారిని చూడడానికి గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

## ఆపదలో ఉన్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ భరోసా

- రూ.24.99 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన బండారు శ్రావణి
- ప్రజల కష్టాలను తీర్చడమే ప్రభుత్వ లక్ష్యం



**శింగనమల - సూర్య వాస్తవం :** ప్రజల సంక్షేమమే లక్ష్యంగా, ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా రూ.24,99,161 విలువైన చెక్కులను ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ బుధవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు.అనారోగ్య సమస్యలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో భరోసాగా నిలుస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల కష్టాలను తెలుసుకుని, వారికి అవసరమైన సమయంలో ఆర్థిక సహాయం అందిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# వైద్య విద్యతో పాటు సాంస్కృతి కార్యక్రమంలో కూడా నైపుణ్యత కలిగి ఉండాలి

**- ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్**





**దొరవారిసత్రం - సూర్య వాస్తవం:** వైద్య విద్యతో పాటు కలలు, సంగీతం నిత్యం సాంస్కృతి కార్యక్రమంలో కూడా వైద్య విద్యార్థులు నైపుణ్యత కలిగి ఉండాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్ అన్నారు. ఆయన బుధవారం,ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో మంగళగిరిలోని ఎన్ఆర్ఐ కాలేజీ లో నిర్వహించిన ఇంటర్-కాలేజీయేట్ కల్చరల్ ఫస్ట్ లో పాల్గొని,ఇంటర్నేషనల్ యూత్ డే సందర్భంగా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.రాష్ట్రంలోని 30 మెడికల్ కాలేజీల నుంచి 350 మంది విద్యార్థులు వివిధ సాంస్కృతిక విభాగాల్లో పాల్గొనడం అభినందనీయమని పేర్కొన్నారు. వైద్య విద్యతో పాటు కళలు, సంగీతం, నృత్యం, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు మరింత పెంపొందుతాయని తెలిపారు.భవిష్యత్ వైద్యులుగా విద్యార్థులు నైపుణ్యం కలిగిన వైద్య నిపుణులతో పాటు కరుణ,మానవతా దృక్పథం, సమాజం పట్ల బాధ్యత కలిగిన వ్యక్తులుగా ఎదగాలని ఆకాంక్షించారు. 2047 నాటికి వికసిత భారత్, ఆరోగ్యకరమైన--సంపన్నమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో యువతదే కీలక పాత్ర అని పేర్కొన్నారు.ఈ చక్కటి కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ, ఎన్ఆర్ఐ కాలేజీ యాజమాన్యం, ఫ్యాకల్టీ సభ్యులను అభినందిస్తూ, పాల్గొన్న ప్రతి విద్యార్థికి మంత్రి సత్యకుమార్ యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు.

## పూలతోట గ్రామంలో తీవ్ర తాగునీటి సమస్య..

**-కలుషితమైన త్రాగునీరే దిక్కు అంటున్న గ్రామస్తులు**
**-మరమ్మతుకు గురైన పథకం నీటి పైపులు**
**-రెండు నెలలుగా మరమ్మతుకు గురైన పథకం నీటి మోటార్లు**



**దొరవారిసత్రం - సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా,దొరవారిసత్రం మండలం పరిధిలోని పూలతోట పంచాయతీ పూలతోట గ్రామంలో తాగునీటి సమస్య తీవ్ర రూపం దాల్చింది.సరైన రక్షిత తాగునీరు అందక గ్రామస్తులు అల్లాడిపోతున్నారు. పథకం నీటి పైపులు మరమ్మతులకు గురి కావడంతో కలుషితమైన నీటిని తాగి వ్యాధుల బారిన పడుతున్నారు.

గ్రామంలో నెలకొన్న నీటి కష్టాలపై అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల మేరకు పూలతోట గ్రామంలో,సుమారు 200 కుటుంబాలు జీవనం గడుపుతూ ఉన్నాయి, మీ కుటుంబాలకు ప్రభుత్వం అమలు చేసిన పథకం నీరు ఆ నీటి పైపులు మరమ్మతులకు గురై ఎక్కడపడితే అక్కడ పగిలి పథకం నీరు మొత్తం కలుషిత గా మారుతూ ఉంది. అయినా కానీ గ్రామస్తులకు నీరు దొరకక ఆ నీటిని తాగుతున్నామని తెలుపుతున్నారు, అధికారులకు ఎన్నిసార్లు తెలిపిన ఫలితం మాత్రం శూన్యం గానే ఉందని అన్నారు.గ్రామంలోని ప్రధాన తాగునీటి బావిలోని నీరు పూర్తిగా కలుషితమైపోయి,త్రాగడానికి వీలు లేకుండా తయారైంది. నిరుపయోగంగా మోటార్లు ఉన్న రెండు మోటార్లు పూర్తిగా చెడిపోయి నెలల తరబడి మూలనపడ్డాయి. దీంతో గ్రామానికి నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. గ్రామంలో నెలకొన్న ఈ దుస్థితిపై సంబంధిత అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా కనీస స్పందన లేదని గ్రామస్తులు వాపోతున్నారు.బిందెడు నీటి కోసం మైళ్ల దూరం వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని,మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి,తక్షణమే చెడిపోయిన మోటార్లను బాగుచేయాలని,కలుషిత నీటి సమస్యను పరిష్కరించి రక్షిత తాగునీరు అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంకు ఘన సత్కారం

**- శాలువా కప్పి సత్కరించిన టీడీపీ యువనేత వేలూరు కళ్యాణ్‌రెడ్డి**
**- రూ.60 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే విజయశ్రీ**

**పెళ్లకూరు-సూర్య వాస్తవం:** మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంను తెలుగుదేశం పార్టీ యువనేత వేలూరు కళ్యాణ్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. నాయుడుపేట పట్టణంలోని గాంధీ పార్క్ వద్ద బుధవారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో ఈ సన్మాన కార్యక్రమం జరిగింది. గాంధీ పార్క్ వద్ద సుమారు రూ.60 లక్షల వ్యయంతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ స్థానిక కూటమి పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంను టీడీపీ యువనేత వేలూరు కళ్యాణ్‌రెడ్డి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే విజయశ్రీ ఆధ్వర్యంలో పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధికి చేపడుతున్న పనులపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



# అవయవదానంపై యువతలో మరింత అవగాహన పెంచాలి

**- మంత్రి సత్య కుమార్ యాదవ్**




**దొరవారిసత్రం - సూర్య వాస్తవం:** అవయవ దానంపై ప్రజల్లో ముఖ్యంగా యువతలో మరింత అవగాహన పెంచాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్ అన్నారు.ఆయన బుధవారం గుంటూరులోని భారతీయ విద్యాభవన్‌లో ఆర్గనైజేషన్ డొనేషన్ డే సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఒక బ్రెయిన్ డెడ్ వ్యక్తి అవయవదానం ద్వారా 8 మంది ప్రాణాలను కాపాడటంతో పాటు, సుమారు 50 మందికి టిష్యూ డొనేషన్ ద్వారా సహాయం చేసే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో దాదాపు 5,945 మంది వివిధ అవయవాల కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. అవయవదానంపై ప్రజల్లో,ముఖ్యంగా యువతలో మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు. మరణానంతరం కూడా మరొకరి జీవితంలో వెలుగులు నింపే అవయవదానం గొప్ప మానవతా సేవ అని పేర్కొంటూ,ప్రతి బ్రెయిన్ డెడ్ కేసులో సాధ్యమైనంత వరకు అవయవదానానికి కుటుంబాలను ప్రోత్సహించాలని,యువత సోషల్ మీడియా ద్వారా ఈ సందేశాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అవయవదానాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల ఫలితంగా 2023లో 41 మంది దోనర్ల ద్వారా 160 అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు, 2024లో 66 మంది దోనర్ల ద్వారా 210,2025లో 93 మంది దోనర్ల ద్వారా 301 శస్త్రచికిత్సలు జరిగాయని తెలిపారు.ఈ మూడేళ్లలో మొత్తం 671 అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు జరిగాయని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో అవయ వదానం ఒక గొప్ప మానవతా సేవ అని,మరింత మంది ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ కోరారు.



# రోగులకు వైద్యంతో పాటు పౌష్టికాహారం అందించడమే లక్ష్యం

**- నాయుడుపేట సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఇన్‌పేషెంట్లకు ఉచిత భోజన వసతి ప్రారంభం**
**- ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం, మందులు, పరీక్షలతో పాటు నాణ్యమైన ఆహారం**
**- ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ**



**నాయుడుపేట- సూర్య వాస్తవం :** ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న కూటమి ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు మెరుగైన వైద్య సేవలతో పాటు పౌష్టికాహారం అందించేందుకు చర్యలు తీసుకుంటోందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ తెలిపారు. నాయుడుపేట సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న ఇన్‌పేషెంట్ రోగులకు ఉచిత భోజన వసతి కార్యక్రమాన్ని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే వారిలో అధిక శాతం మంది పేద, సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారేనని పేర్కొన్నారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన రోగులకు వైద్య చికిత్స ఎంత అవసరమో, వారు త్వరగా కోలుకోవడానికి పౌష్టికాహారం కూడా అంతే ముఖ్యమని అన్నారు. అందుకే ప్రభుత్వం వైద్య సేవలతో పాటు రోగులకు నాణ్యమైన ఆహారం అందించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు.
ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న ఇన్‌పేషెంట్ రోగులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనశీ ఉచితంగా అందించే డైట్ విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని ఎమ్మెల్యే వివరించారు. రోగుల ఆరోగ్య పరిస్థితిని బట్టి వైద్యుల సూచనల మేరకు అవసరమైన ప్రత్యేక ఆహారాన్ని కూడా అందించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.

**నాణ్యత విషయంలో రాజీ వద్దు**

రోగులకు అందించే భోజనం ప్రభుత్వం నిర్దేశించిన మెనూ, నిబంధనలకు అనుగుణంగా ఉండాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఆహారం నాణ్యమైనదిగా, పరిశుభ్రంగా, పౌష్టికంగా ఉండటంతో పాటు సకాలంలో రోగులకు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత నిర్వాహకులను ఆదేశించారు. భోజనం తయారీ, పంపిణీ, నాణ్యతపై ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని సూచించారు. రోగులకు అందించే ఆహారంలో నాణ్యత లోపించకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రోగుల ఆరోగ్యానికి అనుగుణంగా ఆహారం అందేలా చూడాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం కోసం వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

**ప్రజారోగ్యమే కూటమి ప్రభుత్వ ప్రాధాన్యత**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజారోగ్య రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని డా. నెలవల విజయశ్రీ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేద ప్రజలకు మెరుగైన వైద్యం, ఉచిత మందులు, అవసరమైన వైద్య పరీక్షలు, పౌష్టికాహారం, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలోని ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుతున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ రఫీ, పట్టణ ప్రధాన కార్యదర్శి అవధానం సుధీర్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు జివిఆర్ నాయుడు, సంపూర్ణమ్మ, తెలుగుదేశం పార్టీ నాయకులు నానబాల సుబ్బారావు, నిత్యా కృష్ణారెడ్డి, కాపులూరు చక్రపాణి, పలుకూరు ముత్యాలయ్య, మొండెం బాబు, బల్లి ముత్యాలయ్య, గోను బాబు, ఇమ్మడిశెట్టి వెంకటేశ్వర్లు, వాకిరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## హెచ్ఐవిపై ఉన్న అపోహాలు తొలగించడంలో యువత కీలక పాత్ర పోషించాలి

**- ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్**




**దొరవారిసత్రం - సూర్య వాస్తవం:**హెచ్ఐవి పై ఉన్న అపోహాలు వివక్షను తొలగించడంలో యువత కీలకపాత్ర పోషించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. ఆయన బుధవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన ఇంటెన్సఫైడ్ ఐఇసి కాంపెయిన్--2026 కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో గతంతో పోలిస్తే కొత్త హెచ్ఐవి ఇన్ఫెక్షన్లను సుమారు 88శాతం మేర తగ్గించగలిగాం.హెచ్ఐవి/ఎయిడ్స్ కారణంగా సంభవించే మరణాలు కూడా 88.9% మేర తగ్గాయి.2027 నాటికి 95-95-99 లక్ష్యాన్ని సాధించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. రాష్ట్రంలోని దాదాపు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో హెచ్ఐవి పరీక్షలకు అవకాశం కల్పించడంతో పాటు,61 ఆర్ట్ కేంద్రాల ద్వారా ఉచిత చికిత్స అందిస్తున్నాం."సురక్ష డాష్‌బోర్డ్"ద్వారా జిల్లాల వారీగా హెచ్ఐవి నియంత్రణ చర్యలను పర్యవేక్షిస్తున్నాం.అని మంత్రి అన్నారు.హెచ్ఐవి పై ఉన్న అపోహాలు, వివక్షను తొలగించడంలో యువత కీలక పాత్ర పోషించాలని సూచించాను.ఐఇసి కార్యక్రమాలు, సోషల్ మీడియా వంటి వేదికల ద్వారా అవగాహనను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి.ప్రభుత్వం, వైద్య సిబ్బంది,స్వచ్ఛంద సంస్థలు,యువత సమన్వయంతో పనిచేస్తే ఎయిడ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యాన్ని సాధించగలమనే విశ్వాసాన్ని మంత్రి సత్య కుమార్ యాదవ్ వ్యక్తం చేశారు.

## కస్తూర్బా విద్యాలయానికి కంచె కరువు..!

**- అసంపూర్తిగా ఉన్న ప్రహరీ గోడను పూర్తిచేయాలని తల్లిదండ్రులు ఆవేదన**
**- విద్యార్థినీల భద్రతపై విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం**



**పెళ్లకూరు-సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా తడ మండలం తడ కండ్రిగలో గల కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో విద్యార్థినుల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ విద్యాలయంలో సుమారు 260 మంది విద్యార్థినులు ఉంటూ విద్యను అభ్యసిస్తున్నారు. అయితే విద్యాలయం చుట్టూ నిర్మించిన ప్రహరీ గోడ అసంపూర్తిగా ఉండటంతోపాటు ఓ వైపు పూర్తిగా ప్రహరీ లేకపోవడంతో గేట్ ఏర్పాటు చేయకపోవడం విద్యార్థినులకు భద్రత లేకుండా పోయిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రహరీ గోడ లేని ప్రాంతం నుంచి బయట వ్యక్తులు విద్యాలయం పరిసరాల్లోకి సులభంగా ప్రవేశించే అవకాశం ఉండటంతో విద్యార్థినుల్లో అభద్రతాభావం నెలకొంది.గతంలో కొంతమంది యువకులు బాలికల విద్యాలయంలోకి చొరబడి నానా హంగామా సృష్టించిన ఘటన చోటుచేసుకోవడంతో అప్పట్లో విద్యార్థినుల్లో తీవ్ర భయాందోళన నెలకొంది.ఆ ఘటనను గుర్తుచేసుకుంటున్న విద్యార్థినులు రాత్రి వేళల్లో మరింత ఆందోళనకు గురవుతున్నట్లు చెబుతున్నారు.ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థినుల భద్రతకు పూర్తిస్థాయి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.(పస్తుతం ప్రహరీ గోడ అసంపూర్తిగా ఉండటం వల్ల విద్యాలయ ప్రాంగణంలోకి ఆకతాయిలు ప్రవేశించే అవకాశం ఉందని,ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే బాధ్యత ఎవరిదని విద్యార్థుల యొక్క తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. వందలాది మంది బాలికలు నివసిస్తూ విద్యను అభ్యసిస్తున్న విద్యాలయానికి కనీస భద్రతా ఏర్పాట్లు పూర్తిస్థాయిలో ఉండాల్సిన అవసరం ఉందని వారు అంటున్నారు.సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్న విద్యాశాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టుగానీ సమస్య పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టినట్టుగానీ ఎక్కడ కనబడడం లేదు గతంలో జరిగిన చేదు సంఘటనలు మరోసారి పునరావృతం కాకుండా అధికారులు వెంటనే స్పందించి విద్యాలయం చుట్టూ పూర్తిస్థాయి ప్రహరీ గోడ నిర్మించడంతోపాటు విద్యార్థినులకు అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

# 'ఆపరేషన్ సఫేద్ సాగర్' (నెట్ ఫ్లిక్స్) సిరీస్ రివ్యూ!



యథార్థ సంఘటనల ఆధారంగా సినిమాలను .. సిరీస్ లను రూపొందించడంలో బాలీవుడ్ మేకర్స్ ముందుంటారు. ఇక దేశభక్తితో ముడిపడిన వాస్తవ సంఘటనలకు దృశ్య రూపం ఇవ్వడంలోను హిందీ సిరీస్ లు తమ ప్రత్యేకతను చాటుతూ ఉంటాయి. అలా సిద్దార్థ్ హీరోగా రూపొందిన సిరీస్ 'ఆపరేషన్ సఫేద్ సాగర్'. 1999లో భారత్ – పాకిస్థాన్ మధ్య జరిగిన 'కార్గిల్ యుద్ధం' .. వాయుసేనకి చెందిన 'ది గోల్డెన్ యారోస్' పోషించిన పాత్ర నేపథ్యంలో రూపొందిన సిరీస్ ఇది. 6 ఎపిసోడ్స్ గా రూపొందిన ఈ సిరీస్, 'నెట్ ఫ్లిక్స్'లో ఈ నెల 7వ తేదీ నుంచి వివిధ భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది.

పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్ తో శాంతి చర్చలకు భారత్ ప్రయత్నిస్తూ ఉంటుంది. భారత ప్రధాని వాజ్ పేయీ రోడ్డు మార్గం ద్వారా బస్సులో పాక్ వెళ్లడానికి సన్నాహాలు జరుగుతూ ఉంటాయి. అయితే కశ్మీర్ ను దక్కించుకుని తీరాలనే పట్టుదలతో పాక్ ఆర్మీ చీఫ్ ముషారఫ్ ఉంటాడు. కశ్మీర్ ను ఆక్రమించడానికి వ్యూహ రచన చేయడంలో నిమగ్నమై ఉంటాడు. 'ఎల్ ఓ సి' నియంత్రణ రేఖ వెంట ఉన్న భారత్ స్థావరాలను ఆక్రమించమని చెప్పి, ఉగ్రవాదుల వేషంలో పాక్ సైనికులను పంపిస్తాడు.ఒక ఎత్తయిన మంచు పర్వతంపై పాక్ సైనికులు స్థావరాలను ఏర్పాటు చేసుకుంటారు. ఆర్మీ హెలికాప్టర్ లపై కూడా దాడి చేయలేని ఎత్తు నుంచి, భారత సైనికులపై తూటాల వర్షం కురిపిస్తూ ఉంటారు. దాంతో శత్రువులను ఎలా ఎదుర్కోవాలనేది భారత సైన్యానికి అర్థం కాదు. వాయుసేనకి చెందిన 'ది గోల్డెన్ యారోస్' బృందాన్ని రంగంలోకి దింపడమే పరిష్కార మార్గంగా తోస్తుంది. వింగ్ కమాండర్ ధనోవా సారథ్యంలో యువ పైలట్ల బృందం రంగంలోకి దిగుతుంది. టోనీ .. అజయ్ అహూజా గైడెన్స్ తో, థాలి .. బాల్డీ .. సాంగ్రి .. నిశి ఫైటర్ జట్లతో బయల్దేరుతారు. పాక్ సైన్యం రాకెట్ లాంఛర్లతో రంగంలోకి దిగుతుంది. జెట్ ఫైటర్ ఇంజన్ ఫెయిల్ అయిన కారణంగా, నిశి ప్రమాదంలో పడతాడు. ఎలాంటి పరిస్థితులలోను అతనిని కాపాడాలనే ప్రయత్నంలో అజయ్ జెట్ ఫైటర్ రాకెట్ లాంఛర్ దెబ్బకి కుప్పకూలుతుంది. పారాచూట్ సాయంతో బయటపడిన అజయ్, పాక్ సైనికులకు దొరికిపోతాడు. అక్కడ అతనికి ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయి? అతణ్ణి రక్షించుకోవడానికి భారత్ సైన్యం చేసిన ప్రయత్నాలు ఫలిస్తాయా? అనేది మిగతా కథ.దేశభక్తి .. పోరాట పటిమ .. సాహసాలు చేయడంలో ఆసక్తి కలిగిన కొందరు యువకులు, ఫైటర్ పైలెట్లు కావాలని కలలు కంటారు. ఎంతో కష్టపడి తమ కలను నిజం చేసుకుంటారు. వాళ్లంతా కలిసి పనిచేసే ఆపరేషన్ గా ఈ కథ తెరపైకి వస్తుంది. కశ్మీర్ ను ఆక్రమించాలనే పాక్ కుట్రను ఈ టీమ్ ఎలా ఎదుర్కొంది? అనే ప్రధానమైన సమస్య చుట్టూ దర్శకుడు ఈ కథను నడిపించాడు. ఒక వైపున పాక్ లో ఉన్న రాజకీయ పరిస్థితులు .. ముషారఫ్ తీసుకున్న నిర్ణయాలు .. పాక్ కుట్రల కారణంగా బలైపోయిన భారత జవాన్లు .. ఆవేదనతో నిండిపోయిన వారి కుటుంబాల చుట్టూ ఈ యథార్థ కథను ఆవిష్కరిస్తూ వెళ్లారు. 'గోల్డెన్ యారోస్'లో పనిచేసే ఫైటర్ పైలెట్ల శిక్షణ ఎలా ఉంటుంది? ఆ సమయంలో వారు ఎదుర్కొనే ఒత్తిడి ఎలా ఉంటుంది? ప్రేమ .. పెళ్లి .. ఫ్యామిలీ ఎమోషన్స్ ఎలా ఉంటాయి? అనే అంశాలను టచ్ చేస్తూ దర్శకుడు ఈ కథను ముందుకు తీసుకుని వెళ్లాడు. మంచుకొండలు .. ఫైటర్ జెట్లు .. శత్రువుల స్థావరాలు .. బాంబింగ్ జరిగే తీరు .. శత్రు దేశానికి ఫైటర్ పైలెట్స్ దొరికిపోతే ఎలా ఉంటుంది? ఒకరి కోసం ఒకరు చేసే త్యాగాలు ఎలా ఉంటాయి? వంటి సన్నివేశాలను సహజత్వానికి చాలా దగ్గరగా ఆవిష్కరించారు. 1999లో జరిగిన సంఘటనలను కళ్లకు కట్టారు. సిద్ధార్థ పాత్రకి సంబంధించిన క్లైమాక్స్ కన్నీళ్లు పెట్టేలా ఉంటుంది. దేశభక్తి వైపు నుంచి .. ఫ్యామిలీ ఎమోషన్స్ వైపు నుంచి మనసును కదిలించడంలో దర్శకుడు చాలావరకూ సక్సెస్ అయ్యాడని చెప్పాలి. ఈ సిరీస్ కోసం ఆర్టిస్టులను ఎంపిక చేసిన తీరు బాగుంది. ఒరిజినల్ పాత్రలకు చాలా దగ్గరగానే కనిపిస్తారు. అందరూ కూడా సహజత్వానికి చాలా దగ్గరగా తమ పాత్రలను నడిపించారు. దర్శకుడు 'ఓనీ సేన్' టేకింగ్ బాగుంది. సత్యజిత్ పాండే ఫొటోగ్రఫీ .. అనురాగ్ నేపథ్య సంగీతం .. మిక్కీశర్మ ఎడిటింగ్ కథ మరింత బలంగా నడపడం కోసం తమ వంతు కృషి చేశాయి. కథకి తగినట్టుగా ఎంచుకున్న లొకేషన్స్ ప్రధానమైన ఆకర్షణగా నిలిచాయని చెప్పచ్చు.






## అమ్మానాన్న ఉద్యోగస్తులు..
## మేం ప్రయోజకులం కాలేమన్నారు: మాధవన్

పరిశ్రమలో సంబంధాలు లేకపోయినా టాలెంట్‌తో రాణించవచ్చని వ్యాఖ్య ప్రముఖ నటుడు ఆర్. మాధవన్ తన బాల్యం గురించి కొన్ని ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. తన తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగాలు చేస్తుండటంతో, చిన్నప్పుడు తనను, తన సోదరిని చూసి చాలామంది జీవితంలో పైకిరారని అన్నారని ఆయన గుర్తుచేసుకున్నారు. ఇటీవల ఎం9 న్యూస్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో మాధవన్ ఈ వ్యాఖ్యలు చేశారు.జంషెడ్‌పూర్‌లో తన బాల్యం గడిచిందని మాధవన్ తెలిపారు. ఆయన తండ్రి రంగనాథన్ ఒక ప్రైవేట్ సంస్థలో, తల్లి సరోజ బ్యాంకులో పనిచేసేవారని చెప్పారు. తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగాలకు వెళ్లడంతో, పిల్లల బాగోగులు, హోంవర్క్ చూసేవారు ఎవరూ లేరని ఇరుగుపొరుగు వారు అనేవారని ఆయన పేర్కొన్నారు. "పిల్లల భవిష్యత్తు కంటే మీకు ఉద్యోగాలే ముఖ్యమా?" అంటూ చుట్టుపక్కల వారు తరచూ తమ తల్లిదండ్రులను నిందిస్తూ, వారిని బాధపెట్టే ప్రయత్నం చేసేవారని మాధవన్ వివరించారు. అయితే, తన తల్లిదండ్రులు ఇలాంటి విమర్శలను ఏమాత్రం పట్టించుకోలేదని ఆయన స్పష్టం చేశారు. "చాలామంది అనుకున్నట్టు నేను ఇంజనీర్‌ను కాదు. కేవలం బీఎస్సీ ఎలక్ట్రానిక్స్ చదివి, అతికష్టం మీద పాసయ్యాను. చదువులో నేనేమీ గొప్పవాడిని కాదు," అని మాధవన్ నిజాయితీగా అంగీకరించారు. తల్లిదండ్రులు ఇద్దరూ సంపాదించడం వల్లే తనకు ఎక్స్ఛేంజ్-స్టూడెంట్ ప్రోగ్రామ్స్, స్కాలర్‌షిప్స్ కింద విదేశాలకు వెళ్లే అవకాశాలు లభించాయని, అవే తన జీవితాన్ని మార్చేశాయని ఆయన తెలిపారు.తమ తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగాలు చేయడం తనకు గర్వకారణమని, వారు తమకు ఒక మంచి ఉదాహరణగా నిలిచారని మాధవన్ అన్నారు. పరిశ్రమలో ఎలాంటి నేపథ్యం లేకపోయినా ప్రతిభ, కష్టపడి పనిచేసే తత్వం ఉంటే ఎవరైనా విజయం సాధించవచ్చనే తన నమ్మకానికి ఈ అనుభవాలే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. కాగా, మాధవన్ ఇటీవల లి+ణచీలి చిత్రంలో కనిపించారు.



# ద్రవిడ్ పేరిట చెక్కుచెదరని మూడు రికార్డులు..

## -క్రికెట్ చరిత్రలోనే ప్రత్యేకం.. సచిన్‌కు కూడా సాధ్యం కాలేదు!




భారత క్రికెట్ చరిత్రలో అత్యుత్తమ బ్యాటర్లలో ఒకడిగా, అసలు సిసలైన టెస్ట్ ప్లేయర్‌గా కీర్తి గడించిన ఆటగాడు రాహుల్ ద్రవిడ్. తన అద్భుతమైన టెక్నిక్, అచంచలమైన మానసిక దృఢత్వం, ఎలాంటి ఒత్తిడిలోనైనా ప్రశాంతంగా ఆడే నైజంతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నాడు. అభిమానులు ముద్దుగా 'ది వాల్' అని పిలుచుకునే ద్రవిడ్, తన కెరీర్‌లో అన్ని ఫార్మాట్లలో కలిపి 500కు పైగా మ్యాచ్‌లలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. టెస్టుల్లో ఇప్పటికీ భారత్ తరఫున అత్యధిక పరుగులు చేసిన రెండో ఆటగాడిగా ఉన్నాడు. అయితే, కేవలం పరుగులు, గణాంకాలకు మించి ద్రవిడ్ భారత క్రికెట్‌పై చెరగని ముద్ర వేశాడు. అతడు తన టెస్ట్ కెరీర్‌లో సాధించిన కొన్ని రికార్డులు బ్రేక్ చేయడం దాదాపు అసాధ్యం. అలాంటి మూడు అరుదైన రికార్డుల గురించి తెలుసుకుందాం.

### 1. టెస్టుల్లో అత్యధిక బంతులు ఎదుర్కొన్న ఆటగాడు

టెస్ట్ క్రికెట్‌లో ఓ బ్యాటర్ ఓపిక, సహనానికి ఇది గొప్ప నిదర్శనం. రాహుల్ ద్రవిడ్ తన టెస్ట్ కెరీర్‌లో ఏకంగా 31,258 బంతులను ఎదుర్కొన్నాడు. ప్రత్యర్థి బౌలర్లను అలసిపోయేలా చేయడంలో అతనికి అతనే సాటి. క్రికెట్ చరిత్రలో మరే బ్యాటర్ కూడా ఇన్ని బంతులు ఆడలేదు. ఈ జాబితాలో రెండో స్థానంలో ఉన్న 'గాడ్ ఆఫ్ క్రికెట్' సచిన్ టెండూల్కర్ కూడా 29,437 బంతులతో ద్రవిడ్ వెనుకే నిలిచాడు. ఇది ద్రవిడ్ క్రీజులో ఎంత పట్టుదలగా నిలబడేవాడో స్పష్టం చేస్తుంది.

### 2. క్రీజులో అత్యధిక సమయం గడిపిన రికార్డు

అత్యధిక బంతులు ఆడటమే కాదు, క్రీజులో అత్యధిక సమయం గడిపిన రికార్డు కూడా ద్రవిడ్ పేరిటే ఉంది. తన కెరీర్‌లోని 286 టెస్ట్ ఇన్నింగ్స్‌లలో కలిపి 44,152 నిమిషాల పాటు క్రీజులో నిలిచాడు. గంటల తరబడి ఏకాగ్రత కోల్పోకుండా బ్యాటింగ్ చేయడం అతని ప్రత్యేకత. ఈ విషయంలోనూ సచిన్ టెండూల్కర్ (41,304 నిమిషాలు) రెండో స్థానంలోనే ఉన్నాడు. విదేశీ పర్యటనల్లో కఠినమైన పిచ్‌లపై భారత జట్టుకు ద్రవిడ్ అందించిన సేవలకు ఈ గణాంకాలే నిలువుటద్దం.

### 3. అత్యధిక సెంచరీ భాగస్వామ్యాలు




క్రికెట్ అనేది ఒక జట్టు క్రీడ అని ద్రవిడ్ పదేపదే నిరూపించాడు. అతడు తన టెస్ట్ కెరీర్‌లో ఏకంగా 88 సార్లు సెంచరీ భాగస్వామ్యాల్లో పాలుపంచుకున్నాడు. ఇది అతని వ్యక్తిగత ప్రతిభకే కాకుండా జట్టుకు వెన్నెముకగా నిలిచిన తీరుకు నిదర్శనం. ఈ జాబితాలోనూ 86 సెంచరీ భాగస్వామ్యాలతో సచిన్ రెండో స్థానంలో ఉన్నాడు. ముఖ్యంగా సచిన్-ద్రవిడ్ జోడీ టెస్టుల్లో 20 సార్లు శతక భాగస్వామ్యాలు నెలకొల్పడం మరో విశేషం. ఆటగాడిగా తన 164 టెస్టుల్లో 52.31 సగటుతో 13,288 పరుగులు చేసిన ద్రవిడ్, 36 సెంచరీలు, 63 అర్ధ సెంచరీలు సాధించాడు. ఇక, 344 వన్డేలలో 10,889 పరుగులు చేశాడు. ఆటగాడిగా రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత కూడా హెడ్ కోచ్‌గా భారత క్రికెట్‌కు సేవలను కొనసాగించాడు. అతని మార్గదర్శకత్వంలోనే భారత అండర్-19 జట్టు 2018లో ప్రపంచకప్ గెలుచుకోగా, సీనియర్ జట్టు 2024లో టీ20 ప్రపంచకప్‌ను ముద్దాడింది. అంతేగాక 2023లో ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్, వన్డే ప్రపంచకప్ ఫైనల్స్‌కు కూడా జట్టును నడిపించాడు. ఇలా ఆటగాడిగా, కోచ్‌గా భారత క్రికెట్‌కు ద్రవిడ్ అందించిన సేవలు చిరస్మరణీయం.



## గుజరాత్‌కు తిరిగి వెళ్లాలనుకున్న హార్దిక్ పాండ్యా..
## ఆ కండిషన్‌తో ఆఖర్లో బెడిసికొట్టిన డీల్!

టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఐపీఎల్ భవిష్యత్తుపై నెలకొన్న ఉత్కంఠకు మరో కొత్త మలుపు తోడైంది. ముంబై ఇండియన్స్‌ను వీడాలని నిర్ణయించుకున్న అతడు, 2027 సీజన్‌కు ముందు తన పాత ఫ్రాంచైజీ గుజరాత్ టైటాన్స్‌తో చర్చలు జరిపినట్లు సమాచారం. అయితే, కెప్టెన్సీ పగ్గాలు తనకే ఇవ్వాలనే షరతు పెట్టడంతో ఈ డీల్ ముందుకు సాగలేదని తెలుస్తోంది. దీంతో అతని భవిష్యత్తు మరింత సంక్లిష్టంగా మారింది.ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనం ప్రకారం.. పాండ్యాను తిరిగి జట్టులోకి తీసుకునేందుకు గుజరాత్ ఫ్రాంచైజీ తొలుత సుముఖంగానే ఉంది. ఈ విషయాన్ని ప్రస్తుత కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో చర్చించగా, అతడు కూడా తన అంగీకరించాడు. కానీ, జట్టులోకి రావాలంటే కెప్టెన్సీ తనకే ఇవ్వాలని హార్దిక్ షరతు విధించడంతో నిర్ణయాధికారంలో ఉన్న ప్రతి ఒక్కరూ దీనికి 'నో' చెప్పినట్లు సమాచారం."అతడు తిరిగి రావడానికి ఫ్రాంచైజీకి ఎలాంటి అభ్యంతరం లేదు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తోనూ చర్చించాం, అతను కూడా సరే అన్నాడు. కానీ, కెప్టెన్సీ షరతు పెట్టడంతో అందరూ వద్దన్నారు" అని ఫ్రాంచైజీ వర్గాలు తెలిపినట్లు సదరు పత్రిక పేర్కొంది.అయితే, ఈ విషయంపై హార్దిక్ పాండ్యా ప్రతినిధిని సంప్రదించగా, అతడు భిన్నమైన వాదన వినిపించాడు. హార్దిక్ ఏ ఫ్రాంచైజీతోనూ నేరుగా బదిలీ లేదా ట్రేడ్ గురించి చర్చలు జరపలేదని స్పష్టం చేశాడు. ఏవైనా సంప్రదింపులు జరిగితే, అవి ముంబై ఇండియన్స్ ద్వారానే జరుగుతాయని తెలిపాడు. ప్రస్తుతం హార్దిక్ చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్‌తో కూడా ట్రేడింగ్ కోసం చర్చలు జరుపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి.హార్దిక్ పాండ్యా నాయకత్వంలోనే గుజరాత్ టైటాన్స్ 2022లో టైటిల్ గెలిచి, 2023లో ఫైనల్‌కు చేరిన విషయం తెలిసిందే. ఆ తర్వాత అతడు తన పాత జట్టు ముంబై ఇండియన్స్‌కు తిరిగి వచ్చాడు. ముంబైలో రోహిత్ శర్మ స్థానంలో కెప్టెన్ అవ్వడంతో అభిమానుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొన్నాడు. డ్రెస్సింగ్ రూంలోనూ రోహిత్‌కు ఉన్నంత గౌరవం, పట్టు హార్దిక్‌కు లభించలేదని వార్తలు వచ్చాయి. మరోవైపు ముంబై యాజమాన్యం జట్టును పునర్‌నిర్మించాలని చూస్తోంది. ఈ క్రమంలో హార్దిక్‌తో సహా పలువురు సీనియర్లను వదులుకునే అవకాశం ఉంది.

# నేడు మంత్రి మండిపల్లి

# రాయచోటి నియోజకవర్గంలో కార్యక్రమాలు



**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం:** రాష్ట్ర రవాణా, యువజన మరియు క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి 13-08-2026 (గురువారం) రాయచోటి నియోజకవర్గంలో పర్యటించి పలు ప్రజా, సామాజిక, ఆరోగ్య మరియు వ్యవసాయ కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు మంత్రివర్యుల క్యాంపు కార్యాలయం తెలిపింది.

పర్యటన షెడ్యూల్

ఉదయం 08:00 గంటలకు -- బోడిరెడ్డిగారి పల్లె మంత్రి గారి స్వగ్రామంలో నిర్వహించే ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వారి సమస్యలను తెలుసుకుంటారు

ఉదయం 09:30 గంటలకు -- రాయచోటి (ఎస్.ఎన్. కాలనీ) తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 48 మంది లబ్ధిదారులకు సుమారు రూ.40 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేస్తారు.

ఉదయం 11:30 గంటలకు -- రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి రెండు నూతన తల్లి--బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను ప్రారంభిస్తారు.

మధ్యాహ్నం 12:30 గంటలకు -- గాలివీడు మండల వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయ ప్రాంగణంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే కిసాన్ మేళా--2026 కార్యక్రమంలో పాల్గొని రైతులతో ముఖాముఖి మాట్లాడతారు.

అనంతరం మంత్రి గారు ప్రజలకు అందుబాటులో ఉంటూ, నియోజకవర్గంలోని పలు స్థానిక కార్యక్రమాల్లో పాల్గొంటారు.

పై కార్యక్రమాలకు కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, రైతులు, అలాగే ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయవలసిందిగా మంత్రివర్యుల క్యాంపు కార్యాలయం కోరింది.

# రసం పీల్చే పురుగుల ఉధృతిని అరికట్టుటకు

# పసుపు రంగు జిగురు అట్టలను అమర్చుకోవాలి

**- మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి**



**ముద్దనూరు -సూర్యవాస్తవం:** మండలంలోని ఒంటి గారిపల్లె , బొందలకుంట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి గ్రామంలో సాగు చేసిన పంట సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. సాగు చేసిన ప్రతి పంటను తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలి అన్నారు.తదుపరి గ్రామంలో సాగు చేసిన కంది, ప్రత్తి పంటలను పరిశీలించి రసం పీల్చే పురుగుల ఉధృతి లేకుండా చూసుకోవాలి అన్నారు. పసుపు రంగు జిగురు అట్టలను అమర్చుకోవాలి అన్నారు. గులాబీ రంగు పురుగు రాకుండా ముందు జాగ్రత్తగా లింగాకర్షక బుట్టలను ఎకరానికి 8 చొప్పున పంట కంటే ఒక అడుగు ఎత్తులో పెట్టుకోవాలి అన్నారు.సాగు చేసిన పలు పంటలు బెట్టకు గురికాకుండా తగు జాగ్రత్తలు పాటించాలి అన్నారు. బొందలకుంట రైతు సేవా కేంద్రం పరిధిలో ఉన్న రైతులకు యూరియా 19.8 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంది అన్నారు. అవసరం ఉన్న రైతులు తమ ఆధార్ కార్డ్ ద్వారా ఎపి ఎయిమ్స్ 2.0 యాప్ ద్వారా యూరియా పంపిణీ చేస్తామని తెలిపారు. కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రం లో సంప్రదించాలి అన్నారు. అనంతరం గ్రామంలో సాగు చేసిన పచ్చి మిరప,ఉల్లి పంటలను పరిశీలించారు.బెట్ట నివారణకు ద్రవ జీవామృతం ద్రావణం ను పంట పైన పిచికారీ చేయాలి అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకులు సింధు, కల్పన, ధరణి, మరియు గ్రామ రైతులు రమణారెడ్డి, ఈశ్వర రెడ్డి, గంగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు చేయూతను అందించడమే మానవతా ఉద్దేశం

**- అన్నమయ్య జిల్లా ఎంపిపిల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి**



లక్కిరెడ్డిపల్లె- సూర్య వాస్తవం :నిరుపేదలను గుర్తించి వారికి చేయూతను అందించడమే మానవతా ముఖ్య ఉద్దేశం అని అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక నలంద విద్యానికేతన్ పాఠశాలలో ఏర్పాటుచేసిన మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగ హాజరయ్యారు. ఈ సందర్భంగా మానవతా నూతన కార్యవర్గంలో ఎన్నికైన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సంస్థ నిరుపేద విద్యార్థులతో పాటు నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తుండడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం ఎన్నికైన ఈ నూతన కార్యవర్గం కూడా మానవతా సంస్థను మంచి మార్గంలో నడిపిస్తూ పేద కుటుంబాలకు చేయూతను అందించే దిశగా ముందడుగు వేస్తే మరింత బలపరచాలన్నారు. ఎంతోమంది దాతల సహకారంతో నేడు రాష్ట్రంలోని చాలా ప్రాంతాలలో మానవతా స్వచ్ఛంద సంస్థ పేద కుటుంబాలకు అండగా నిలుస్తుండడం అభినందనీయమన్నారు. నూతనంగా ఎన్నిక కాబడిన మానవతా అధ్యక్షులు లల్లు యాదవ్, ఉపాధ్యక్షులు మనోహర్ రెడ్డి లను దుస్సాలువాళ్ళతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మానవతా చైర్మన్ బాల సుబ్రమణ్యము, కో చైర్మన్ శివశంకర్ రెడ్డి, జిల్లా సెక్రెటరీ ప్రసాద్ యాదవ్, ప్రతిభ శివగంగి రెడ్డి, నరసింహ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# 41వ వార్డులో కాంగ్రెస్ పార్టీలో చేరికలు





**ప్రొద్దుటూరు - సూర్యవాస్తవం:** ప్రొద్దుటూరు పుర పాలక సంఘం 41వ వార్డు కు చెందిన వెంకట సుబ్బయ్య బుధవారం తన కుటుంబ సభ్యులు మరియు ఇతరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షురాలు ఎన్.డి. విజయజ్యోతి, ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఇర్ఫాన్ బాషా వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా విజయజ్యోతి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ పేదలు, సామాన్య ప్రజల పార్టీ అని, రాజ్యాంగ స్ఫూర్తితో ప్రతి ఒక్కరినీ సమానంగా గౌరవిస్తూ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పనిచేస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా, వైఎస్ షర్మిలా రెడ్డిని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చూడటానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఇర్ఫాన్ బాషాను సంప్రదించాలని, ఆయన ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా చేనేత వర్గానికి చెందిన వారు సంక్షేమ పథకాలు అందడం లేదని విన్నవించగా, సంబంధిత శాఖల అధికారులను సంప్రదించి సమస్య పరిష్కారానికి ఇర్ఫాన్ బాషా కృషి చేస్తారని విజయజ్యోతి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు నగర కాంగ్రెస్ అధ్యక్షుడు గొసంగి సుబ్బారెడ్డి, మైనారిటీ నాయకులు షేక్ మౌలాలి, షేక్ గౌస్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి వెండి ముఖ విలాసం, గొడుగు సమర్పణ





**బ్రహ్మంగారిమఠం-సూర్య వాస్తవం :** బ్రహ్మంగారిమఠంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి బిందె సేవలో భాగంగా వెండి ముఖ విలాసం, వెండి గొడుగును భక్తిశ్రద్ధలతో కీర్తిశేషులు, మాజీ ఆలయ అధ్యక్షులు ముచ్చర్ల చిన్న వెంకటసుబ్బయ్య శ్రేష్ఠి సోదరుడు, రిటైర్డ్ గ్రామీణ బ్యాంక్ సీనియర్ మేనేజర్ వెంకటసుబ్బయ్య, ఆయన ధర్మపత్ని లక్ష్మీదేవి, కుమారుడు కిషోర్ కుమార్, కోడలు లక్ష్మీ కల్పన కలిసి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయానికి వెండి ముఖ విలాసం, వెండి గొడుగును ఆలయ అధ్యక్షులు అయ్యపు వెంకట సురేష్ బాబుకు అందజేశారు. ఆలయ పూజారి చౌడేశ్వర శర్మ ఆధ్వర్యంలో వెండి ముఖ విలాసం, గొడుగుకు సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించి, దాతలతో కుంకుమ పూజ చేయించారు. అనంతరం వెండి ముఖ విలాసం, గొడుగుతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షులు అయ్యపు వెంకట సురేష్ బాబు సెక్రెటరీ సుంకు సురేష్ బాబు దాతలను ఆలయ మర్యాదలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళా మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# వైసిపి వారు చేసే ఎర్రచందనం స్మగ్లింగ్ ను

# మంత్రి రాంప్రసాద్ రెడ్డికి అంటగట్టడం తగదు

**- ప్రజా దర్బార్‌కు హాజరైనంత మాత్రాన ముఖ్య అనుచరులైపోతారా?**

**- టీడీపీ మహిళా నేతలు ప్రశ్న**



**అన్నమయ్య బ్యూరో- సూర్య వాస్తవం:** ఎర్రచందనం అక్రమ రవాణా వ్యవహారాన్ని రాజకీయంగా వాడుకుంటూ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పై ఆరోపణలు చేయడం తగదని టీడీపీ మహిళా నేతలు హెచ్చరించారు. బుధ వారం రాయచోటి టిడిపి కార్యాల యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు వైసిపి నేతలు, సాక్షి పత్రిక, సాక్షి మీడియా పై విరుచుకుపడ్డారు. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే ఎర్రచందనం, గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా పెద్ద ఎత్తున సాగిందని ఆరోపించారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారు నిర్వహించే ప్రజా దర్బార్ కు ప్రజలు, వివిధ వర్గాల వారు తమ సమస్యలను చెప్పుకునేందుకు హాజరవుతుంటారని, ప్రజా దర్బార్‌కు వచ్చిన ప్రతి వ్యక్తిని మంత్రికి ముఖ్య అనుచరుడిగా చిత్రీకరించడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. వైసీపీ నాయకుడు, ఎర్రచందనం స్మగ్లర్ తోట వెంకటాద్రికి, మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని వారు స్పష్టం చేశారు. వైసీపీ నేతల పై ఉన్న ఎర్రచందనం అక్రమ రవాణా ఆరోపణలను మంత్రి రాంప్రసాద్ రెడ్డికి ఆపాదిస్తూ వార్తలు ప్రచారం చేయడం, వాస్తవాలను వక్రీకరించడమేనని విమర్శించారు. వైసీపీ హయాంలో జరిగిన అక్రమ రవాణా, స్మగ్లింగ్ వ్యవ హారాలకు కూటమి ప్రభుత్వంలోని మంత్రిని బాధ్యుడిని చేయాలని ప్రయత్నించడం రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నదని వారు అన్నారు. ప్రజా దర్బార్ వంటి కార్యక్రమాలను కూడా రాజకీయ వివాదాలకు ముడిపెట్టడం మానుకోవాలని సూచించారు. తప్పుడు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు ఇక సాగవని, వాస్తవాలను ప్రజలు గమనిస్తున్నారని టీడీపీ మహిళా నేతలు పేర్కొన్నారు. అక్రమ దందాలు ఎవరు చేశారో ప్రజలకు బాగా తెలుసునని, వాటిని ఎలాంటి మచ్చలేని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పై రుద్దే రాజకీయ జిమ్మిక్కులు ఇక పనిచేయవు అని వారు స్పష్టం చేశారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9885404140 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad 9948461699 )

సూర్య వాస్తవం
Truth of News
http://www.suryavastavam.in



# మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాలు

- శ్రీ సిటీ పరిధిలోని అడెలా అడ్మైర్ కేబుల్ కంపెనీలో మహిళలపై నేరాల నివారణపై అవగాహన.
- ఏర్పేడు పోలీస్ స్టేషన్ పరిధిలోని పాపానాయుడుపేట గ్రామంలో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం.
- మహిళల భద్రత,చట్టపరమైన రక్షణ,వేధింపుల నివారణపై అవగాహన కల్పించిన పోలీసు అధికారులు.





**దొరవారిసత్రం – సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, ఐపీఎస్.ఆదేశాల మేరకు మహిళల భద్రత, మహిళలపై జరుగుతున్న నేరాల నివారణ, చట్టపరమైన రక్షణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.ఇందులో భాగంగా శ్రీ సిటీ పరిధిలోని అడెలా అడ్మైర్ కేబుల్ కంపెనీలో శ్రీ సిటీ డీఎస్పీ బి.వి.శ్రీనివాసులు మరియు శ్రీ సిటీ పోలీస్ స్టేషన్ మహిళా ఎస్ఐ ఎం. ప్రియాంక ఆధ్వర్యంలో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళలపై నేరాలు, వేధింపులు, గృహహింస,సైబర్ వేధింపులు తదితర అంశాలపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు.అదేవిధంగా ఏర్పేడు పోలీస్ స్టేషన్ పరిధిలోని పాపానాయుడుపేట గ్రామంలో ఏర్పేడు ఎస్ఐ ఆధ్వర్యంలో "మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం"నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళల భద్రత,మహిళలపై నేరాల నివారణ,వేధింపులు ఎదురైనప్పుడు తీసుకోవాల్సిన చర్యలు,పోలీసులను సంప్రదించే విధానం తదితర అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. మహిళలు తమకు ఎదురయ్యే సమస్యలను నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని, ఎటువంటి ఇబ్బంది ఎదురైనా వెంటనే పోలీసులను సంప్రదించాలని అధికారులు సూచించారు. మహిళలపై నేరాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మహిళలకు సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని, మహిళల భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అధికారులు సూచించారు.

# మున్సిపల్ రంగ ప్రైవేటీకరణను ఉపసంహరించాలి

## కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి-12వ పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేసి అసెంబ్లీలో తీర్మానం చేయాలి-మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్




**నాయుడుపేట– సూర్య వాస్తవం:** మున్సిపల్ రంగంలో ప్రైవేటీకరణను వెంటనే ఉపసంహరించు కోవాలని, అర్హత కలిగిన కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) డిమాండ్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులతో పాటు మున్సిపల్ రంగంలోని పర్మినెంట్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు ఎదురుచూస్తున్న 12వ పీఆర్‌సీ కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని కోరింది. ఈ డిమాండ్ల సాధన కోసం చేపట్టాల్సిన కార్యాచరణపై బుధవారం నాయుడుపేటలోని సీఐటీయూ కార్యాలయంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎస్.కె. కాలేశా అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తిరుపతి జిల్లా యూనియన్ గౌరవాధ్యక్షులు జి. బాలసుబ్రహ్మణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డీపల్లి చెంగయ్య పాల్గొని మాట్లాడారు.

**ఉద్యోగ భద్రత కల్పించాలి**

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు పట్టణ ప్రజలకు పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాలు తదితర అత్యవసర పౌర సేవలను నిరంతరం అందిస్తున్నప్పటికీ వారి ఉద్యోగాలకు భద్రత లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ సేవలను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం వల్ల కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రతతో పాటు ప్రజలకు అందే సేవల నాణ్యత కూడా దెబ్బతింటుందని అన్నారు.కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు అంశాన్ని త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి తీర్మానం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

**దశలవారీగా పోరాట కార్యాచరణ**

డిమాండ్ల సాధనలో భాగంగా ఆగస్టు 13, 14 తేదీల్లో మంత్రులు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు నాయకులు తెలిపారు. ఆగస్టు 15న గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించడం, ఆగస్టు 17న రాష్ట్రంలోని మున్సిపల్ పట్టణాల్లో ప్రదర్శనలు నిర్వహించడం, ఆగస్టు 27న విజయవాడలో రాష్ట్ర సదస్సు నిర్వహించడం వంటి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు వెల్లడించారు. మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులను ఐక్యం చేసి దశలవారీగా నిరసనలు, పోరాట కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. మున్సిపల్ కార్మికుల ఐక్యతే విజయానికి మార్గమని, హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని బాలసుబ్రహ్మణ్యం, వడ్డీపల్లి చెంగయ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్. ముకుంద, మున్సిపల్ యూనియన్ నాయకులు రమణమ్మ, శ్యామలమ్మ, అనిల్, పోలయ్య, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్న కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండ

- 42 మంది లబ్ధిదారులకు రూ.30.72 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 626 మందికి రూ.5.71 కోట్లకు పైగా ఆర్థిక సహాయం
- అర్హులైన ప్రతి కుటుంబానికి త్వరితగతిన సహాయం అందేలా కృషి
- ఇప్పటివరకు 626 మందికి రూ.5.71 కోట్లకు పైగా ఆర్థిక సహాయం



**నాయుడుపేట– సూర్య వాస్తవం :** అనారోగ్యంతో వైద్య ఖర్చులు భరించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) భరోసాగా నిలుస్తోందని తెలిపారు. నాయుడుపేటలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని 42 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.30,72,775 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ భారీగా వైద్య ఖర్చులు చేసిన కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటోందన్నారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా మెరుగైన వైద్యం పొందలేని పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం ఎంతో ఊరటనిస్తోందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సూళ్లూరుపేట నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్), ఎల్ఓసీ ద్వారా ఇప్పటివరకు 626 మంది లబ్ధిదారులకు రూ.5,71,68,272 ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని అర్హులైన బాధిత కుటుంబాలకు ప్రభుత్వ సహాయాన్ని అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. వైద్య చికిత్స కోసం ఆర్థిక సహాయం అవసరమైన అర్హులైన ప్రతి కుటుంబానికి వీలైనంత త్వరగా సీఎంఆర్ఎఫ్ ద్వారా సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల కష్టాలను ప్రభుత్వం తన కష్టాలుగా భావిస్తూ ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఆపదలో ఉన్న కుటుంబాలకు అవసరమైన సమయంలో ప్రభుత్వ సహాయాన్ని అందించేందుకు కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజల కష్టాల్లో తోడుగా... ప్రతి కుటుంబానికి భరోసాగా ప్రభుత్వం నిలుస్తోందన్నారు.

# కార్పొరేషన్ డివిజన్ల పునర్విభజన మళ్లీ చేయండి...

- పెద్ద పీర్ల చావిడిని తెరిపించండి..
- జిల్లా ఇన్చార్జి మంత్రిని కోరిన మైనార్టీ నేత మహబూబ్ బాషా



**దొరవారిసత్రం – సూర్య వాస్తవం :** తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని డివిజన్ల పునర్విభజన మళ్లీ చేయాలని టిడిపి మైనార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, తిరుపతి కో–ఆపరేటివ్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ షేక్ మహబూబ్ బాషా కోరారు. బుధవారం అమరావతిలో జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్‌ను తిరుపతి కార్పొరేషన్ పరిధిలో వార్డుల పునర్విభజన తిరిగి చేయాలని కోరుతూ మహబూబ్ బాషా వినతిపత్రం సమర్పించారు. తిరుపతి నగరంలో అధికారులు తమకు అనుకూలంగా ఇష్టం వచ్చినట్లు వార్డుల పునర్విభజన చేశారని,దీనివల్ల ప్రజలు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారని మంత్రికి ఫిర్యాదు చేశారు. అధికారులు డివిజన్లో వారీగా క్షేత్రస్థాయిలో వెళ్లకుండా, పరిశీలన చేయకుండా అటు ప్రజలను ఇటు రాజకీయ నేతలను గాని సంప్రదించకుండా ఏకపక్షంగా పునర్వి విభజన చేశారని ఆరోపించారు. అధికారులు చేసిన పునర్విభజనను పూర్తిగా రద్దు చేసి తిరిగి ప్రజల వద్దకు వెళ్లి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మీడియాతో మహబూబ్ బాషా మాట్లాడుతూ తిరుపతి కార్పొరేషన్ పరిధిలో 66 డివిజన్లను ఏర్పాటు చేశారని అధికారులు సక్రమంగా డివిజన్ల పునర్విభజన చేయలేదన్నారు. ఒకటి డివిజన్ మూడవ డివిజన్లో విభజించి చేయడం జరిగిందన్నారు. దీనివల్ల ప్రజల నుండి సమస్యలు కాలెత్తే అవకాశం ఉందని ఇప్పటికైనా ఇన్చార్జి మంత్రి దృష్టి సారించి వెంటనే తిరిగి డివిజన్ల పునర్విభజన చేయించాలని, అదిశ గా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అలాగే పెద్ద పీర్ల చావిడి వద్ద ఉన్న మటన్ మార్కెట్‌ను తిరిగి పున ప్రారంభించాలని, మటన్ మార్కెట్ తెరిపించకపోవడం వల్ల పదుల సంఖ్యలో ముస్లిం మైనార్టీ కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉందని విజ్ఞప్తి చేశారు. ముస్లిం మైనార్టీ సోదరులు ఎన్నో దశాబ్దాలుగా మటన్ మార్కెట్‌ల ద్వారా ఉపాధితో కుటుంబాల జీవనం సాగిస్తున్నారని, వీటి వలన పెద్ద పేర్లు చావడి మూసివేయడం వల్ల వారికి జీవనోపాధి లేక వారి కుటుంబాలు వీధిన పడ్డారని, వెంటనే మంత్రి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి మటన్ మార్కెట్ వ్యాపార స్తులకు న్యాయం చేయాలని ఆదేశించారు. జిల్లా ఇన్చార్జి మంత్రిని మహబూబ్ బాషాతో పాటు మాజీ ఎమ్మెల్సీ షరీఫ్ కూడా ఉన్నారు.

## జిల్లాలో పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలి

- కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి రైతులను ఆదుకోవాలి..!
- ఈనెల 18న కర్నూలు కలెక్టరేట్ ముట్టడికి సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య పిలుపు
- రైతులు, కూలీలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని సూచన

**పత్తికొండ టౌన్ – సూర్య వాస్తవం :**కర్నూలు జిల్లాలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న గుండ్రేవుల, ఆర్డీఎస్, వేదావతి, హంద్రీ--నీవా తదితర సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన "బద్లావ్ జరూరీ హై -- మార్పు కావాలి" పాదయాత్రలో భాగంగా బుధవారం కోతిరాళ్ల, కొత్తపల్లి గ్రామాల్లో పర్యటించి రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా గిడ్డయ్య మాట్లాడుతూ.. కర్నూలు జిల్లాలో వరుసగా కరువు పరిస్థితులు నెలకొంటున్నప్పటికీ జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. వర్షాలు సక్రమంగా లేకపోవడం, సాగునీటి వనరులు అందుబాటులో లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు.గుండ్రేవుల, ఆర్డీఎస్, వేదావతి, హంద్రీ--నీవా వంటి కీలక ప్రాజెక్టులు పూర్తయితే జిల్లాలో లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా ఈ ప్రాజెక్టుల పరిస్థితిలో మార్పు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ పనులకు తక్షణమే నిధులు కేటాయించి యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.కరువు కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా, నాణ్యమైన విత్తనాలను ఉచితంగా అందించాలని కోరారు. వ్యవసాయ కూలీలకు విస్తృతంగా ఉపాధి హామీ పనులు కల్పించి, రైతుల రుణభారాన్ని తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి, పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించే వరకు సీపీఐ ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తుందని గిడ్డయ్య హెచ్చరించారు. గ్రామస్థాయిలో ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి తీసుకువస్తామని తెలిపారు. ఈ నెల 18న కర్నూలు కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి, కరువు జిల్లాగా ప్రకటన, రైతుల సమస్యల పరిష్కారం కోసం జరిగే పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమానికి కొత్తపల్లి శాఖ కార్యదర్శి హనుమంతు అధ్యక్షత వహించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి. రాజాసాహెబ్, సీపీఐ మండల కార్యదర్శి యు. కారుమంచి, జిల్లా సమితి సభ్యులు కారన్న, కొత్తపల్లి గిడ్డయ్య, నెట్టికంటయ్య, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, మండల సహాయ కార్యదర్శి జోహారాపురం కాశీ, పట్టణ సహాయ కార్యదర్శి ఎంకే సుంకన్న, శ్రీనివాసులు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి రంగన్న, పందికోన శాఖ కార్యదర్శి రవి, ప్రజా సంఘాల నాయకులు నాగేంద్రయ్య, సిద్దు, రవి, రామాంజనేయులు, ఉపేంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

